

- పాలుపోని స్థితిలో తెగిస్తోన్న వైసీపీ శ్రేణులు
- పోలింగ్ సమీపిస్తోన్న కొద్దీ అధికార నేతల్లో కంగారు
- కూటమి శ్రేణులు ఉత్సాహం.. ఫ్యాన్ పార్టీలో నైరాశ్యం





అసహనం ఆగడాలు

బాపట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ సమయం సమీపి స్తోంది. ప్రచారాలకు కేవలం రెండు రోజులే గడువు. శనివారం సాయంత్రంతో ప్రచారాలు ఆగిపోతాయి. నామినేషన్ల అనంతరం నుంచి రోజురోజుకు కూటమి శ్రేణులు ఉత్సాహంతో కథం తొక్కుతుండగా.. వైసీపీ శ్రేణులు నైరాశ్యంలో మునిగిపోయారు. నామినేషన్ల ఘట్టం ముగిసిన తర్వాత ఆయా నియోజకవర్గాల్లో వైసీపీ పరిస్థితి మరింత దిగజారింది. ఓ వైపు ప్రజల్లో కానరాని స్పందన, మరో వైపు ద్వితీయశ్రేణి నేతలు టీడీపీ బాట పట్టడంతో వైసీపీ అభ్యర్థుల్లో అసహనం పతాక స్థాయికి చేరిం ది. దీంతో టీడీపీ శ్రేణుల మీద దాడులకు తెగబడుతున్నారు. సామాజిక వర్గాలను కించపరిచే విధంగా దుర్భాషలాడు తున్నారు. పలు చోట్ల దుశ్చర్యలకు దిగుతున్నారు. ప్రజల్లో స్పందన కానరాకపోగా, సొంతపార్టీ శ్రేణులూ టీడీపీ బాట పట్టడంతో అసహనంతో వైసీపీ ఉన్మాద చర్యలకు దిగుతున్నట్లు టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. వైసీపీ అభ్యర్థుల నోటి దూలకు బాధితులుగా సొంత పార్టీ శ్రేణులు కూడా మిగిలిపోతున్నారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని ఓ మండల స్థాయి నేతపై సదరు అభ్యర్థి ఇష్టారీతిన మాట్లాడడంతో పాటు ఓ దశలో చేయి కూడా చేసుకోబోయారని సమాచారం. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో దాదాపు ఇదే పరిస్థితిని వైసీపీ ఎదుర్కొంటోంది.

అద్దంకిలో రెచ్చగొట్టే ధోరణిలో..

రెచ్చగొట్టే వ్యాఖ్యలతోనో, దాడులతోనే పబ్బం గడుపుకోవాలనే కుట్ర రాజకీయాలకు వైసీపీ అభ్యర్థి పాణెం హనిమిరెడ్డి తెరలేపారు. వలంటీర్లంతా వైసీపీ కార్యకర్తలేననే వ్యాఖ్యలు చేయడంతో పాటు వారంతా తమకే పని చేస్తారని ఏం చేసుకుంటారో చేసుకోండనే వివాదాస్పద వ్యాఖ్యలు గతంలో చేసిన సంగతి తెలిసిందే. ప్రచార కార్యక్రమాల్లో హనిమిరెడ్డికి కనీస స్థాయిలో కూడా స్పందన లేకుండా పోయింది. దీంతో అసహనంతో టీడీపీ శ్రేణులపై దాడికి వైసీపీ శ్రేణులను ఉసిగొల్పే వికృత క్రీడకు తెరలేపారు. తాగునీరు, పారిశుధ్యం సమస్యలను గురించి మేదరమెట్లలో ప్రశ్నించిన ఓ మహిళపై వైసీపీ నేతలు దాడికి తెగబ డ్డారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరారని సంతమాగులూరు మండలం సజ్జాపురం ఎస్సీ కాలనీకి చెందిన వారి ఇంటిపై దాడి చేసిన ఘటన తాజాగా చోటు చేసుకుంది.

రెచ్చగొట్టే చర్యలకు కుట్రలు..

అన్ని అస్త్రాలను వాడేసిన వైసీపీ అభ్యర్థులు పోలింగ్‌కు మరో మూడు రోజులే గడువు ఉండడంతో గ్రామాల్లో వైషమ్యాలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే అవకాశం ఉందని టీడీపీ నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దొడ్డి దారిని ఏదో ఒకటి చేసి ప్రజలను మాయ చేయాలనే వ్యూహాలు రచిస్తున్నారని ఆరోపిస్తు న్నారు. పుకార్లు వ్యాపింప చేసి రాజకీయ లబ్ధి పొందే కుటిల యత్నాలకు వైసీపీ పాల్పడే అవకాశం ఉందంటు న్నారు. పోలింగ్ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ నేతలు కోరుతున్నారు.


టీడీపీ అభ్యర్థి నామినేషన్‌కు హాజరయ్యారని..

రేపల్లె టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారనే కోపంతో దళిత కాలనీవాసులకు తాగునీరు సరఫరా నిలిపేయడం వైసీపీ నేతల అసహనానికి పరాకాష్టగా నిలిచింది. రేపల్లె మండలం ఊలుపాలెం గ్రామంలో ఎక్కువగా దళితులే ఉంటారు. వీరిలో అధికశాతం మంది టీడీపీ అభ్యర్థి అనగానికి జై కొట్టడమే కాకుండా నామినేషన్ కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. దీం తో తాగునీటి విషయంలో ఇబ్బందులకు తెరలేపారు. ఈ విషయాన్ని సీ-విజిల్ యాప్ ద్వారా ఎమ్మెల్యే అనగాని జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లగా నీటి సరఫరాను పునరుద్ధరించారు. రోజు రోజుకు పరిస్థితి దిగజారుతుండటంతో బాపట్ల నియోజకవర్గంలో వైసీపీ నేతలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బంధువులు ప్రచారంలో ఓ సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారన్న ప్రచారం జరిగింది. ఆ వ్యాఖ్యలను అక్కడ ఉన్న సొంత పార్టీ శ్రేణు లే తీవ్రంగా వ్యతిరేకించాయి. దీంతో వారు అధికారంలోకి వచ్చాక అందరి అంతు చూస్తామంటూ బంధువులు ఊగి పోవడం అక్కడున్న వారిని విస్మయ పరిచింది.



రేపల్లె దళిత కాలనీకి తాగునీరు సరఫరా నిలిపేయడంతో ట్యాంకర్ ద్వారా నీళ్లు తెచ్చుకున్న కాలనీ వాసులు (ఫైల్‌ఫొటో)

మందు పోస్తున్నారు..



- ఏరులైపారుతున్న మద్యం
- ఎక్కడికక్కడ జోరుగా పంపిణీ
- ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా సరఫరా
- గ్రామాలు, పట్టణాల్లో పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఖర్చు రూ.50 కోట్ల పైమాటే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు అంటేనే మందుబాబులకు పండుగ. చుక్క పడనిదే ప్రచారాలు జరగవు.. ప్రచారాల్లో సందడి ఉండదు. పోలింగ్ తేదీ సమీపిస్తోన్న కొద్దీ మద్యం పంపిణీ ముఖ్యమవుతోంది. ఎన్నికలంటేనే మద్యం పంపిణీ ఆనవాయితీగా మారింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు మద్యం పంపిణీలో పోటీ పడుతుంటారంటే దానికి ఎంతటి ప్రాధాన్యం ఉందో అర్థమవుతోంది. మద్యం ఇవ్వకపోతే ఎక్కడ తనకు నష్టం జరుగుతుందోనని అభ్యర్థులు భావిస్తుంటారు. మద్యం ఎటు వైపు ఎక్కువగా పంపిణీ చేస్తే అటు వైపు కార్యకర్తలు, నేతలు హడావుడి ఉంటుంది. మద్యం పంపిణీ చేయకపోతే ఆ అభ్యర్థి డబ్బు తీయడంలేదన్న ప్రచారం కూడా చేస్తారు. దీంతో ఎన్నికల ప్రక్రియలో ఎక్కడ వెనుకపడతామోనన్న భయంతో ప్రధాన పార్టీలకు మద్యం పంపిణీ తప్పనిసరైంది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో జోరుగా మద్యం పంపిణీ జరుగుతోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మద్యం ఖర్చు రూ.50 కోట్లు పైమాటే అని సమాచారం. ఈ సారి ఎన్నికల నిబంధనల్లో మద్యంపై పటిష్ఠ నిఘా పెట్టారు. గతంలో ప్రైవేటు దుకాణాల్లో ఎంతమేర అవసరమైతే అంత స్టాకును ముందుగానే తెచ్చుకునే వారు. అయితే ఈ సారి మద్యం కేవలం ప్రభుత్వ దుకాణాల్లో అందుబాటులో ఉండటం.. అక్కడ విక్రయాలపై నిఘా పెట్టారు. దీంతో అభ్యర్థులు ముందుగానే మద్యం ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఎక్కడికక్కడ మద్యం పంపిణీకి ఏర్పాట్లు జరిగాయని సమాచారం. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ4.5 కోట్ల నుంచి 5 కోట్ల వరకు కేవలం మద్యానికే అభ్యర్థులు ఖర్చు చేస్తున్నట్లు పార్టీ వర్గాల లెక్కలు తెలియజేస్తున్నాయి. ఐదు రోజులుగా మద్యం పంపిణీ ఊపందుకుంది. ప్రతి రోజు పట్టణాల్లో వార్డులు, గ్రామాల వారీగా మద్యం పంపిణీ జరుగుతోంది. గ్రామాలు, వార్డుల్లో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసి అక్కడి నుంచి రాత్రి వేళ మద్యం పంపిణీ చేస్తున్నారు. ఓటర్ల సంఖ్య ఆధారంగా మద్యం సరఫరా జరుగుతోంది. వార్డులకు 4 నుంచి 9 కేసుల వరకు మద్యం కేటాయిస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లో ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా మద్యం కేసులు అందుతున్నాయి. క్వార్టర్ రూ.150 నుంచి రూ.250 ధర ఉన్న మద్యంను పంపిణీ చేస్తున్నారు. ఓటర్ల స్థాయిని బట్టి మద్యం బ్రాండ్‌లు మారుతున్నాయి. కొన్ని చోట్ల నేరుగా మద్యం కేసులను పంపిణీ చేస్తున్నారు. మరి కొన్ని చోట్ల స్లిప్‌లను అందజేస్తున్నారు. స్లిప్‌లలో పేర్కొన్న విధంగా నేతలు మద్యం తీసుకొచ్చి పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు ముందస్తుగానే బార్‌లలో అభ్యర్థులు మద్యం నిల్వ చేసుకున్నారు. ఇలా మందస్తు చర్యలు తీసుకోని నియోజకవర్గాల్లో వార్డుల వారీగా ఒక్కొక్కరికి రూ.200 చొప్పున నగదు అందచేస్తున్నారు. మద్యంతో పాటు మంసాహార భోజనం కూడా పంపిణీ చేస్తున్నారు. మందుబాబులకు పోలింగ్ వరకు ఎటువంటి ఇబ్బంది లేకుండానే మద్యం డోర్ డెలివరీ జరుగుతుంది. పోలింగ్ రోజు వరకు మద్యం పంపిణీ జరిగేలా ఎక్కడికక్కడ ఏర్పాట్లు జరిగాయి.

ఓటు.. సామాజిక బాధ్యత

- స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి
- కలెక్టర్ పి. రంజిత్ బాషా

బాపట్ల, మే 9: పౌరులంతా సామాజిక బాధ్యతగా భావించి స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటు వేసుకునే అవకాశం ఉందన్నారు. ఓటరు గుర్తింపుకార్డు లేని పక్షంలో ఎన్నికల కమిషన్ ధ్రువీకరించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటు వేయవచ్చన్నారు. పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురై ఓటు హక్కును దుర్వినియోగం చేసుకోవద్దన్నారు. పాలకులను నిర్ణయించే గొప్ప అవకాశం ఓటర్లకే ఉందన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి గురువారం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేయాల్సిన బారికేడ్‌లు, సీసీకెమెరాలు, వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాట్లపై అధికారులు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్

బీసీలు టీడీపీ కుటుంబ సభ్యులే..

- గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని
- యాదవ సంఘీయులతో ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్

తెనాలి రూరల్, మే 9: వైసీపీ ప్రభుత్వంలో బీసీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయ పరంగా ఎదగనివ్వకుండా ఓటు బ్యాంకుగా వాడుకున్నారని కూటమి ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆరోపించారు. గురువారం పట్టణంలోని ఎన్వీఆర్ కల్యాణమండపంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లతో కలిసి యాదవ సంఘీయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ బీసీలు తొలినుండి తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులేనన్నారు. పార్టీని ఎన్టీఆర్ స్థాపించింది మొదలు పూర్తిగా నడిపించే బాధ్యత తీసుకుంది కూడా బీసీ సామాజిక వర్గం వారేనని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు బీసీ సోదరలకు, సోదరీమణులకు అనేక వాగ్దానాలు చేసిందని తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వాటన్నింటిని మరిచి పాలన సాగించిందని విమర్శించారు. టీడీపీ హయాంలో బీసీల అభ్యున్నతికి ప్రవేశపెట్టిన అనేక పథకాలను నిర్వీర్యం చేసి వారిని సామాజికంగా ఆర్థికంగా దెబ్బతీసేలా పాలన చేసిందని ఆక్షేపించారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ నియోజవర్గంలో బీసీలలో పేదలందరికీ నివేసన స్థలాలు, పక్కా ఇల్లు కట్టించేలా ప్రణాళికా బద్ధంగా అమలు చేస్తామన్నారు. బీసీల ఆర్థికంగా బలపరిచేలా కూటమి ప్రభుత్వం పాలన ఉండనుందని తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బీసీలందరికీ రక్షణ చట్టంతో పాటు వారి అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పాటుబడనుందన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్‌ను గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని ఆలపాటి విజ్ఞప్తి చేశారు. ఇటీవల కాలంలో మృతి చెందిన మాజీమార్కెట్ యార్డు చైర్మన్ టీడీపీ సీనియర్ నాయకులు దివంగత గడవర్తి సుబ్బయ్యను స్మరించుకుంటూ ఆయనకు నివాళులర్పించి 5 నిముషాలు మౌనం పాటించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరరావు, నిమ్మకాయల రమ్య, పెద్దసంఖ్యలో యాదవ సంఘీయులు, ఉమ్మడి పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గడవర్తి సుబ్బయ్య మృతికి నివాళులర్పిస్తున్న పెమ్మసాని, నాదెండ్ల, ఆలపాటి తదితరులు

అరాచక పాలనను అంతం చేద్దాం

- నారా భువనేశ్వరి
- లోకేశ్‌తో పాటు ఎన్నికల ప్రచారం



కురగల్లు రచ్చబండలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి

మంగళగిరి, మే 9: రాష్ట్రంలో ఇకమీదట ఎవ్వరూ భయపడుతూ బతకరాదని.. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో హాయిగా జీవించే రోజులు రావాలంటే మే 13న ప్రతి ఓటరూ కూటమి అభ్యర్థులకే ఓటేసి గెలిపించాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజకవర్గం కురగల్లులో గురువారం రాత్రి తనయుడు లోకేశ్‌తో కలిసి ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబును 53 రోజులపాటు జైలులో పెట్టినపుడు మహిళలంతా తనకు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. వారి స్ఫూర్తితోనే తాను రాష్ట్రవ్యాపితంగా నిజం గెలవాలి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించగలిగానన్నారు. గత అయిదేళ్లుగా రాష్ట్రంలో అరాచక ప్రభుత్వం ప్రజలను ఎన్నో రకాలుగా ఇబ్బందులకు అవస్థలకు గురిచేసిందన్నారు. భారత రాజ్యాంగం ప్రజలకు ప్రసాదించిన స్వేచ్ఛ, స్వాతంత్రాలను జగన్ పూర్తిగా హరించివేసిందన్నారు. అందుకే స్వేచ్ఛ స్వాతంత్రాలకోసం ప్రజలు ఈ అరాచక ప్రభుత్వాన్ని మే 13న సాగనంపాలని విజ్ఞప్తి చేశారు. గత అయిదేళ్లుగా ఎంతోమంది టీడీపీ కార్యకర్తలు తమ జీవితాలను త్యాగం చేసి ప్రాణాలను పణంగా పెట్టి అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. అటువంటి కార్యకర్తలను తామెన్నటికీ మర్చిపోలేమన్నారు. వారందరినీ రాబోయే రోజుల్లో కన్నబిడ్డల్లా చూసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి అంటే కేవలం బటన్ నొక్కడమే కాదు.. కష్టాల్లో వున్న ప్రజలను ఆదుకోవాలన్నారు. రాష్ట్ర విభజన తరువాత ప్రజలు కష్టాల్లో వున్నపుడు చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు అహర్నిశలు శ్రమించారని గుర్తుచేశారు. ఇప్పటి పరిస్థితుల్లో కుటుంబానికి తండ్రిమాదిరి రాష్ట్రాన్ని ముందుకు నడిపించే నాయకుడు కావాలని, ఆ సమర్థత చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. మే 13న జరుగనున్న పోలింగ్‌లో మంగళగిరి నుంచి పోటీ చేస్తున్న లోకేశ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భువనేశ్వరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కూటమి ప్రభుత్వంతోనే ముస్లింలకు భద్రత

- చేబ్రోలులో పెమ్మసాని శ్రీరత్న, ధూళిపాళ్ళ వైదీప్తి రోడ్ షో

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), మే9: ముస్లిం మైనార్టీలకు కూటమి ప్రభుత్వంలోనే భద్రతా ఉంటుందని పెమ్మసాని శ్రీ రత్న, ధూళిపాళ్ళ నాగ సాయి వైదీప్తి అన్నారు. గురువారం చేబ్రోలులో గుంటూరు అభ్యర్థి సతీమణి పెమ్మసాని శ్రీ రత్న, ఎమ్మెల్యే అభ్యర్థి కుమార్తె ధూళిపాళ్ళ నాగ సాయి వైదీప్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. శ్రీరత్న మాట్లాడుతూ పొన్నూరు ప్రాంతంలో ధూళిపాళ్ళ కుటుంబం ప్రజా సేవలో దశాబ్దాల తరబడి కొనసాగుతున్నారన్నారు. వీరయ్య చౌదరి హయాంలో నుంచి నరేంద్ర కుమార్ వరకు పొన్నూరును టీడీపీకి అడ్డాగా మార్చారారన్నారు. సంగం డెయిరీ ద్వారా పాల రైతుల ఆదాయాన్ని పెంచటమే కాకుండా ఎందరో ఉపాధి కల్పిస్తున్నారన్నారు. పొన్నూరు ప్రాంత అభివృద్ధికే జీవితాలు అర్పించారన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ప్రజలో అపోహలు సృష్టించేందుకు వేధింపులకు పాల్పడిందని ఆరోపించారు.వైదీప్తి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లుగా ముస్లింలకు భద్రతా లేకుండా పోయిందన్నారు. గెలవనున్న కూటమి ప్రభుత్వంలో తిరిగి అన్ని పథకాలను ముస్లింలకు అమలులోకి తేనున్నట్లు చెప్పారు. ప్రజలకు అందుబాటులో అండగా ఉండే పెమ్మసాని చంద్రశేఖర్‌ను, ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



చేబ్రోలులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శ్రీరత్న, వైదీప్తి



మిల్లులో దాచిన మద్యం బాటిల్‌లను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ షామీర్‌బాషా

వైసీపీ నేత మిల్లులో మద్యం స్వాధీనం

రాజుపాలెం, సత్తెనపల్లి, మే9: మండలంలోని కోటనెమలిపురి గ్రామ బస్టాండ్ సెంటర్లోని మిల్లులో అక్రమంగా దాచివుంచిన 359 మద్యం బాటిళ్లను గురువారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో వైసీపీ నేతలకు, కార్యకర్తలకు అందజేసేందుకు తీసుకువచ్చి వైసీపీ నేత దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డికి చెందిన మిల్లులో దాచి ఉంచారని ఓవ్యక్తి అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో ఎస్ఐ షామీర్‌భాషా ఎన్నికల అధికారి శేఖర్‌బాబు ఆధ్వర్యంలో మిల్లులో తనిఖీలు నిర్వహించి మొత్తం 359 మద్యం బాటిళ్లలను స్వాధీనం చేసుకున్నారు. వీటివిలువ రూ46,350 ఉంటుందన్నారు.

297 మద్యం బాటిళ్ళు స్వాధీనం

సత్తెనపల్లి పట్టణంలోని విక్టర్ బారు వెనుక నుంచి మూడు గోతాల్లో తీసుకువెళ్తున్న 297మద్యం బాటిళ్ళను సెబ్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ షరీఫ్‌లు బుధవారం రాత్రి దాడిచేసి పట్టుకున్నారు. నాగన్నకుంటకు చెందిన ఎం. మహేష్, కాకుమాను హృదయరాజులు మూడు గోతాల్లో మద్యం తీసుకొని వెళ్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

తనిఖీల్లో నగదు సీజ్

గుంటూరు(తూర్పు),మే9: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యం లో గురువారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా గుంటూరు తూర్పు, పశ్చిమ, మంగళగిరినియోజకవర్గాల్లో వరుసగా రూ.2,96,500, రూ.42,500, రూ.87,500 నగదు, తాడికొండ నియోజకవర్గంలో రూ.35,000 వస్తువులను సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. జిల్లాలో మే 9వ తేది సాయంత్రం 6 గంటల వరకు జరిగిన తనిఖీల్లో రూ.3,64,11,311 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- వైసీపీకి చెందిన డబ్బు తరలిండగా ఘటన?



కారసాని వెంకట్ (ఫైల్)

యడ్లపాడు, మే 9: రోడ్డు ప్రమాదానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని చెంఘిజ్‌ఖాన్‌పేట గ్రామ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గుంటూరులోని పెద పలకలూరుకు చెందిన కారసాని శ్రీనివాసరావు కుమారుడు కారసాని వెంకట్(32) గత పదిరోజులుగా యడ్లపాడు మండలంలో వైసీపీకి మద్దతుగా తన్నీరు సీతారామయ్య కుమారుడు తన్నీరు రాజేష్‌తో కలసి పనిచేస్తున్నాడని తెలిసింది. ఈ నేపథ్యంలో ఓటర్లకు నగదు పంపిణీ చేసేందుకు ద్విచక్రవాహనంపై కొండవీడు గ్రామంవైపు ద్విచక్రవాహనంపై బయలుదేరినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని వెంబడించడంతో ద్విచక్రవాహనాన్ని అతి వేగంతో పోనిచ్చారు. దీనితో బున్నినగర్, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాల మధ్య ద్విచక్రవాహనం అదుపుతప్పి మార్జిన్‌లో పార్కుచేసి ఉన్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఇరువురూ పడిపోయారు. ఈ ఘటనలో వెంకట్ అక్కడికక్కడే చనిపోగా, రాజేష్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. అతనిని గుంటూరులోని ప్రైవేటు హాస్పటల్‌కు తరలించారు. కాగా ఇద్దరూ కలసి సుమారు రూ.1.80 కోట్లు కొండవీడు మార్గంలోని గ్రామాలలోని ఓటర్లకు పంచేందుకు తరలిస్తున్నట్లు సమాచారం. అయితే పోలీసులు మాత్రం ఎలాంటి నగదును తరలించడం లేదని, అతి వేగం కారణంగానే ప్రమాదం జరిగిందని చెప్పడం విశేషం. కాగా పోలీసులు ఆ మొత్తాన్ని పక్కకు మళ్ళించినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

రేపటి నుంచి మిర్చి యార్డుకు సెలవులు

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శనివారం నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే ఎండలు ముదరడంతో యార్డులో కార్మికులు పని చేయడం చాలా కష్టంగా మారింది. అయినప్పటికీ ఎప్పటిలానే మే రెండో వారం వరకు యార్డులో లావాదేవీలను కొనసాగించారు. కాగా శుక్రవారం ఉదయం 6 గంటలవరకు మాత్రమే యార్డులోనికి సరుకుని అనుమతిస్తారు. వాటివరకే ట్రేడింగ్ జరుపుతారు. అనంతరం మిగిలిపోయిన టిక్కీలను రైతులు శీతలగిడ్డంగులకు తరలించుకో వాల్సి ఉంటుంది. తిరిగి జూన్ 10వ తేదీన యార్డు గేట్లు తెరుచుకొంటాయి.



ఆర్టీసీ బస్సులో ప్లకార్డు ప్రదర్శిస్తున్న కలెక్టర్ శివ శంకర్

ఆర్టీసీ బస్సులో కలెక్టర్

- ప్రయాణికులకు ఓటు హక్కుపై అవగాహన..

నరసరావుపేట, మే 9 : నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి స్వీప్ యాక్టివిటీ, ఓటు హక్కుపై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన సత్తెనపల్లి పల్లెవెలుగు బస్సులో ప్రయాణించారు.ప్లకార్డులు ప్రదర్శించి, ప్రయాణికులతో ముచ్చటించి ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక మెను

పిడుగురాళ్ళ, మే9: ఇప్పటివరకు జరిగిన అన్ని ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియకు వచ్చిన సిబ్బందికి ఆయా గ్రామాలలో పట్టణాలలో ఇరుపార్టీల నేతలు భోజన, టిఫిన్ సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవడం తెలిసిందే. ఈఎన్నికల్లో అలాంటివి ఏమీ లేకుండా ఎన్నికల కమిషన్ బుధవారం ఓ జీఓ జారీచేసింది. అదేమిటంటే ఈ నెల 13న జరుగనున్న ఎన్నికల ప్రక్రియకు కేటాయించిన పోలింగ్ సిబ్బంది భోజన సదుపాయాల కోసం ఏ రాజకీయపార్టీ నేతలను ఆశ్రయించకుండా తగిన నిధులు విడుదల చేయడంతో పాటు ఎన్నికల సిబ్బందికి 12వతేదీ రాత్రి భోజనం, 13వతేదీ ఉదయం అల్పాహారం, భోజనం, సాయంత్రం స్నాక్స్, కొబ్బరిబొండా, జ్యూస్ లాంటివి ఏర్పాటు చేసుకోవాలని మెను కూడా ప్రకటించింది. ఎన్నికలకు ముందు రోజు 12వ తేదీ సాయంత్రం టిఫిన్, రాత్రికి భోజనంలో చపాతి, రైస్, ఆకుకూర పప్పు, రోటీ పచ్చడి, టమాట ఆలు కర్రీ, పెరుగు, రసం, అరటిపండు, మరునాడు ఉదయం 3 ఇడ్లీ, రెండు గారె, 9 గంటలకు జ్యూస్, 11 గంటలకు స్నాక్స్, 12.30 గంటలకు వెజిటబుల్ బిర్యాని, 3 గంటలకు బిస్కెట్స్, టీ, సాయంత్రం 6 గంటలకు అల్పాహారంతో మెను ఏర్పాటు చేసింది.



బ్రహ్మారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన రమేష్ తదితరులు

టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్

- సాదరంగా ఆహ్వానించిన జూలకంటి బ్రహ్మారెడ్డి

దుర్గి, మే9: మండలంలోని గజాపురంకు చెందిన వైసీపీ సర్పంచ్ జక్కా రమేష్ ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలో కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రమేష్‌తోపాటు మరో 20 కుటుంబాల వారికి పార్టీ కండువా కప్పి బ్రహ్మారెడ్డి సాదరంగా ఆహ్వానించారు. రమేష్ మాట్లాడుతూ. వైసీపీ బలోపేతానికి ఎంతో కృషి చేసినప్పటికీ చివరికి తమకు నిందలు, అవమానాలే మిగిలాయని, అందుకే ఆ పార్టీలో ఇమడలేక టీడీపీలో చేరామని అన్నారు.

నేడు చంద్రబాబు పర్యటన

మాచర్లటౌన్,మే9: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం మాచర్ల పట్టణానికి విచ్చేయనున్నారని జూలకంటి బ్రహ్మారెడ్డి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం 3గంటలకు కళామందిరంసెంటర్లో బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగిస్తారన్నారు. నియోజకవర్గ పరిధిలోని మాచర్ల, వెల్దుర్తి, కారంపూడి, దుర్గి, రెంటచింతల మండలాల నుంచి కూటమి నేతలు తరలిరావాలని పిలుపునిచ్చారు.



వీరాపురంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ మేఘన తదితరులు

శ్రీకృష్ణదేవరాయలు గెలుపు

పల్నాడు అభివృద్ధికి మలుపు

- ఎంపీ అభ్యర్థి లావు సతీమణి మేఘన

పిడుగురాళ్ల: పల్నాడు ప్రాంతం అభివృద్ధి, రైతులకు సాగునీరు పుష్కలంగా అందాలన్నా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతోనే సాధ్యమవుతుందని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సతీమణి డాక్టర్ మేఘన తెలిపారు. గురువారం పిడుగురాళ్ల మండలం వీరాపురం, దాచేపల్లి మండలంలోని ఇరికేపల్లి గ్రామంలో మహిళలు, పార్టీశ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేఘన మాట్లాడుతూ పల్నాడు ప్రాంతమంటేనే రైతులు అధికంగా వుండే ప్రాంతమని, రెండు పంటలకు సాగునీరు అందించేందుకు మేజర్, మైనర్ కాల్వల మరమ్మతులు పూర్తి చేసే లక్ష్యంతో టీడీపీ పనిచేస్తుందన్నారు. రైతులకు వెన్నుదన్నుగా వుండే టీడీపీని గెలిపించేందుకు ఎంపి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుకు, గురజాల అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పున్నం నాగమల్లిఖార్జునరావుతో పాటు పలువురు నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేల్పూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐజీ అజిత్‌సింగ్

ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా చూడాలి

- డీఐజీ డాక్టర్ అజిత్‌సింగ్

వేల్పూరు(శావల్యాపురం)మే 9: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పల్నాడు జిల్లా ఎన్నికల పోలీసు పరిశీలకులు, డీఐజీ డాక్టర్ అజిత్‌సింగ్ సిబ్బందిని ఆదేశించారు. శావల్యాపురం మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఒకటైన వేల్పూరులోని పోలింగ్ కేంద్రాలను ఆయన గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల భవనాలు, పోలింగ్ బూత్ నెంబర్‌లు, మౌలిక వసతులు, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు అందజేశారు. వినుకొండ నియోజకవర్గంలోని సమస్యాత్మక గ్రామాలు, ఆయా గ్రామాలలో గతంలో ఎన్నికలు జరిగిన తీరు, సీసీ కెమేరాల ఏర్పాటు తదితర అంశాలను గురించి వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్‌రావును ఆరా తీశారు. వారితో పాటు ఎస్ఐ చల్లా సురేష్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

అర్ధరాత్రి ప్రచారం

- నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఎన్నికల ప్రచారం
- తుమ్మకోటలో అర్ధరాత్రి ఒంటి గంట దాకా..
- వైసీపీకి అనుకూలంగా నిలిచిన ఎస్ఐ నారాయణరెడ్డి

మాచర్లటౌన్, మే 9: మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ ఎన్నికల ప్రచారం ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సాగుతోంది. బుధవారం నియోజకవర్గంలోని మాచర్ల మండలం కొత్తపల్లి, ద్వారకాపురి, లచ్చంబావి, అచమ్మకుంట, సుబ్బారెడ్డిపాలెం, బెల్లంకొండవారిపాలెం, నాగులవరం, తాళ్లపల్లి, భైరవునిపాడులతోపాటు రెంటచింతల మండలం తుమ్మకోటలో వైసీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అయితే ఎన్నికల నిబంధనల ప్రచారం ప్రచారం రాత్రి 10 గంటలకు ముగించాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా ఒకే రోజు మరిన్ని గ్రామాలు ప్రచారాలు పెట్టుకొని తుమ్మకోటలో రాత్రి 11 గంటల తరువాత ప్రచారం ప్రారంభించి అర్ధరాత్రి ఒంటిగంట దాకా కొనసాగించారు. ప్రచారంలో బాణాసంచా, డప్పులు, డీజేలు ఉపయోగించడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఇదంతా రెంటచింతల ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి ఆధ్వర్యాన జరగడం విశేషం. మద్యం సేవించిన యువకులు బైకుల సైలెన్సర్లు పీకేసి భారీ శబ్దాలతో రౌండ్లు కొట్టడం చేశారు. టీడీపీ ప్రచారం జరుగుతుంటే రాత్రి 10 గంటలకు పది నిమిషాల ముందే ఆపాలని హుకుం జారీ చేసే సదరు ఎస్ఐ వైసీపీ ప్రచారం విషయంలో పూర్తిగా వైసీపీకి సహకరించడం విమర్శలకు దారి తీస్తోంది. తుమ్మకోట గ్రామంలో బైకులపై టీడీపీకి సంబంధించి చంద్రబాబు స్టిక్కర్లు ఉంటే స్టిక్కర్లు తొలగిస్తూ యువతతో ఘర్షణ పడ్డారు ఎస్ఐ నారాయణరెడ్డి. అదే వైసీపీకి సంబంధించి జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్లు ఉంటే వాటిని తొలగించకుండానే చూసీచూడనట్టు వెళ్లిపోయారు. ప్రచారంలో నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పోట్ల ముత్తయ్య, పి సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేశాం: ఆర్వో శ్యాంప్రసాద్

తుమ్మకోటలో అర్ధరాత్రి వరకు జరిగిన వైసీపీ ప్రచారంపై సీవీజీ యాప్ ద్వారా ఫిర్యాదు అందిందని, సమయం ముగిసినప్పటికీ ప్రచారం జరగడంతో కేసు నమోదు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ అన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైసీపీ ప్రచారంలో వలంటీర్

బాపట్ల, మే 9 : పట్టణంలోని భీమావారిపాలెం సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఓ మహిళా వలంటీరు పాల్గొన్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. దీనిపై మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఆమెపై చర్యలు తీసుకోలేదని, తక్షణమే ఆ వలంటీరుని విధులనుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.



భీమావారిపాలెంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్

అబద్దాల పాలనకు చెల్లు చీటి

- 1604వ రోజుకు రైతుల ఆందోళనలు



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే9: అమరావతే రాష్ట్ర రాజధాని అని, అధికారంలోకి వచ్చిన తరువాత బ్రహ్మాండంగా కడతామని చెప్పిన సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానులని ప్రజలను మోసం చేశాడని రాజధాని అమరావతికి 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, మహిళలు, రైతు కూలీలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1604వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాలు ఇళ్ల వద్ద నుంచి వారు మట్లాడుతూ, ఐదేళ్ల అబద్దాలతో వైసీపీ సర్కార్ పాలన గడిచిందన్నారు. నిజమైన అభివృద్ధి జరిగే పాలన రాబోతుందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో నిరసనలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,172
చికెన్ విత్ స్కిన్	292.00
చికెన్ స్కిన్ లెస్	302.00

69,876 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 55,964 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 69,876 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 28,712 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	17800
నెంబరు. 5	9000	15000
273	9500	13000
341	9000	14000
4884	8500	12000
సూపర్ 10	15600	17000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	8500	15500
దేవనూరు డీలక్స్	9000	16000
తెల్లకాయలు	5000	11000

టీడీపీ విజయం కోరుతూ గుండ్రెడ్డి శివ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన

బాపట్ల, మే 9 : వైసీపీ నాయకుల వైఖరి నచ్చక, తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ పనితీరుపై నమ్మకంతో టీడీపీలో చేరిన జీఎస్సార్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డి శివ గురువారం భారీ ప్రదర్శన నిర్వహించారు. బాపట్ల, కర్లపాలెంకు చెందిన నాయకులు, కార్యకర్తలు, తన అనుచరులతో బైక్‌లు, కార్లు, ఆటోలలో తరలి వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. కర్లపాలెం మండలం యాజలి గ్రామం నుంచి ప్రారంభమైన ర్యాలీ బుద్దాం, కర్లపాలెం, నల్లమోతువారిపాలెం, హైదర్‌పేట, నందిరాజుతోట మీదగా బాపట్లకి చేరుకుంది. కర్లపాలెం సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి బాపట్లలోని అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్నాధపురం నుంచి గుండ్రెడ్డి శివ అనుచరులు భారీ ప్రదర్శనగా వచ్చి ఆయనకు స్వాగతం పలికారు. అందరు కలిసి నరేంద్రవర్మ విజయానికి కృషి చేస్తానని హామినిచ్చారు. ఆయనతో కలిసి ముందుడుగు వేశారు. కార్యక్రమంలో నాయకులు జికె.నాయుడు, పెద్ది సుబ్రహ్మణ్యం, ఇమ్మడిశెట్టి లక్ష్మయ్య, నాగయ్య, గోపి, కిషోర్, పుష్పాల సాంబశివరావు, తిరువీధుల శంకరప్రసాద్, నలగల సురేష్ తదితరులు పాల్గొన్నారు.




పట్టణంలో నిర్వహిస్తున్న ర్యాలీ, గుండ్రెడ్డి శివకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కోడ్ ఉల్లంఘిస్తే గుర్తించి సమాచారం ఇవ్వాలి

● ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళసింగ్



సమావేశంలో మాట్లాడుతున్న పరిమళసింగ్, కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, మే 9 : పోలింగ్ సమయంలో కోడ్ ఉల్లంఘన పరిస్థితులు ముందుగా గుర్తించి సమాచారం ఇవ్వాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళసింగ్ తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో గురువారం సూక్ష్మపరిశీలకుల రెండవదశ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణను ఉద్దేశించి పరిమళ సింగ్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు అధిక సంఖ్యలో ఉంటే తక్షణమే ఆర్‌వోలకు లేదా సాధారణ పరిశీలకులకు సమాచారం ఇవ్వాలన్నారు. 12వ తేది ఉదయం 9 గంటలకు కేటాయించిన నియోజకవర్గంలోని రిసెప్షన్ సెంటర్‌కు చేరుకోవాలన్నారు. తదుపరి పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలకు వెళ్ళాలన్నారు. ఈనెల 13వ తేదీన ఉదయం 7 గంటలు నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. అదే రోజున ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ చేసే ప్రక్రియను గమనించాలన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకుల ఆధ్వర్యంలో విధులు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాలలో సూక్ష్మ పరిశీలకుల విధులు పరిశీలించాల్సిన 18 అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఖాజన్‌సింగ్, నోడల్ ఆఫీసర్ పీవీ రమణ, ఎల్‌డీఎం శివకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయకత్వంలోనే క్రైస్తవులకు మేలు

● టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటే స్వామిదాసు

బాపట్ల, మే 9 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నాయకత్వంలోనే క్రైస్తవులకు మేలు జరుగుతుందని ఆ పార్టీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటే స్వామిదాసు అన్నారు. పట్టణంలో గురువారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, క్రిస్టియన్‌సెల్ నాయకులతో కలిసి సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. బాపట్ల పార్లమెంట్ క్రిస్టియన్‌సెల్ అధ్యక్షుడు జంగం ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో 277 చర్చిలకు 45 కోట్ల రూపాయలు ఇచ్చారన్నారు. విదేశీ విద్యకు 68 మందికి 15 లక్షల రూపాయల చొప్పున ఇవ్వటమే కాకుండా జెరూషలేం యాత్రకు 2,500 మందిని పంపించారన్నారు. సబ్సిడీ రుణాలు 4,300 మందికి ఇచ్చి ఉపాధి కల్పించారన్నారు. క్రైస్తవులంతా చంద్రబాబుకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో శ్యామ్, పాస్టర్స్ క్రిస్టియన్ సెల్ నాయకులు పాల్గొన్నారు.

యానాదుల అవసరాలు తీర్చలేని ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి : తెన్నేటి

బాపట్ల, మే 9 : యానాదుల కనీస అవసరాలు తీర్చలేని ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్య ర్థి తెన్నేటి కృష్ణప్రసా ద్ సోదరుడు తెన్నేటి నరహరి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన యానాది సంఘనాయకులతో కలిసి కొండుబొట్లపాలెంలోని జికె. నాయుడు యానాది కాలనీలో పర్యటించారు. యానాదుల దుర్భరజీవితాలపై పాలకులు స్పందించకపోవటం దారుణమన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే స్థలాలిచ్చి ఇళ్ళు కట్టించి పిల్లల చదువులకు పాఠశాల ఏర్పాటు చేస్తామని, మహిళలకు చేతివృత్తులలో శిక్షణ ఇప్పిస్తామని హామీనిచ్చారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యానాది హక్కుల పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షుడు తిరువీధుల శంకరప్రసాద్, తెన్నేటి సంధ్య, కె.రమేష్, చేవూరి శ్రీను, ఆనందమోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న మనో దంపతులు



సినీగాయకులు మనో కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, మే 9 : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారిని ప్రముఖ సినీగాయకులు మనో (నాగూర్‌బాబు) కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారిని దర్శించుకోవటం ఎంతో అదృష్టమని మనో కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారికి శ్రీబగళా అమ్మవారి చరిత్రను గురించి ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలియజేశారు. ఆలయ అర్చకులు నిర్వహించిన హోమ కార్యక్రమాలలో పాల్గొన్నారు. వారికి అమ్మవారి చిత్రపటాలను అందజేసి పూలమాలలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల డీఎస్పీపై ఎన్నికల పరిశీలకులకు ఆమంచి ఫిర్యాదు

బాపట్ల రూరల్, మే 9 : చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌పై బాపట్ల జిల్లా ఎన్నికల పరిశీలకుడు పరిమిళ్‌సింగ్‌కు, పోలీసు పరిశీలకుడు అయ్యప్పన్‌కు బుధవారం చీరాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎన్నికల పరిశీలకులు విచారించి తగుచర్యలు తీసుకుంటామని హామినివ్వటం జరిగిందన్నారు. చీరాల డీఎస్పీపైన కేంద్ర ఎన్నికల అధికారి, రాష్ట్ర ఎన్నికల అధికారికి కూడా ఫిర్యాదు చేసినట్లు ఆమంచి తెలిపారు.

కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ ప్రచారం

వేమూరు, మే 9: కూటమి అభ్యర్థుల విజయం కోసం మద్దతు పలుకు తూ గురువారం మండలంలోని జంపని, పోతుమర్రులో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ చుండూరు మండల అధ్యక్షుడుకాళహస్తి గోపి మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణకు ఎన్డీఏ ప్రభుత్వం అలాగే రాష్ట్రంలోని కూటమి అభ్యర్థులు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులకు మాదిగలంతా పూర్తి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మురిరిపూడి రాజయ్య, చుండూరు భాస్కరరావు పాల్గొన్నారు.

ఆనందబాబు గెలుపు కోరుతూ వీర మహిళలు...

వేమూరు, మే 9 : కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నక్కా ఆనందబాబు విజయాన్ని కాంక్షిస్తూ గురువారం మండలంలోని చావలిలో జనసేన పార్టీ వీర మహిళలు విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి జగన్మోహన్‌రెడ్డిని ఓడించాలని కోరారు.

ఈతేరు గ్రామంలో ...

బాపట్ల,మే 9 : మండలంలోని ఈతేరు గ్రామపంచాయతీ పరిధిలో కూటమి అభ్యర్థుల గెలుపు కోరుతూ బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ కట్టా సుగణ్యారావు పాల్గొని కూటమి అభ్యర్థులు వేగేశన నరేంద్రవర్మ,తెన్నేటి కృష్ణప్రసాద్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కట్టా రాధాకృష్ణ, మన్నె సాంబయ్య, దమ్ము బాబురావు, పాల్, బేతాళం సుబ్బారావు, కాలింత సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

బాపట్ల,మే 9 : పట్టణంలోని హయ్యర్ నగర్‌కు చెందిన పాలడుగు సాల్మన్ రాజు నాలుగు మద్యం బాటిల్స్ తీసుకొని వెళుతుండగా చెక్‌పోస్ట్ వద్ద స్క్వాడ్ పట్టుకున్నట్లు సీఐ య్.శ్రీనివాసులు తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఓటర్లకు కరపత్రాలు పంచుతూ ఓట్లు అభ్యర్థిస్తున్న వేగేశన నరేంద్రవర్మ



ప్రజలకు అభివాదం చేస్తున్న కూటమి నరేంద్రవర్మ, ఎంపీ అభ్యర్థి భార్య శిరీషా

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన

పిట్టలవానిపాలెం, మే 9 : రాష్ట్రాభివృద్ధి వచ్చే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని బాపట్ల నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని అల్లూరు, అలకాపురం, గ్రామపంచాయతీలలో గ్రామ, మండల పార్టీ శ్రేణులతో కలిసి గురువారం రోడ్‌షో నిర్వహించారు. ఈసందర్భంగా నరేంద్రవర్మ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, బాపట్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌లను సైకిల్ గుర్తులపై అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్థానిక సమస్యలను పరిష్కరిస్తానని ప్రజలకు వేగేశన నరేంద్రవర్మ హామినిచ్చారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయు డు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎంపీగా తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే తాను బాపట్ల నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. తొలుత అల్లూరు గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ చిట్టి అబ్బాయి పార్టీ కార్యాలయంలో వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఎండి అఫ్జల్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానేట్‌సోపాటి, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కనుమూరి సాంబమూర్తిరాజు, మోదుగుల శంకర్‌రెడ్డి, మండల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం,మే 9 : సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబునాయుడు వలనే రాష్ట్రాన్ని పునఃనిర్మించుకోవటం జరుగుతుందని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ద్వారానే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యపడుతుందని బాపట్ల నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని చింతాయపాలెం, గణపవరం గ్రామాలలో వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ భార్య శిరీషా, జనసేననాయకులు నామన శివన్నారాయణ ఎన్నికల ప్రచారంలో పాల్గొనగా ఊళ్ళలోని ప్రజలంతా నరేంద్రవర్మ ప్రచారంలో పాల్గొన్నారు. ముందుగా మహిళలు పెద్దఎత్తున నరేంద్రవర్మకు హారతులిచ్చి పూలజల్లులతో ఘనస్వాగతం పలికారు. చింతాయపాలెం, గణపవరం ఎన్నికల ప్రచారంలో 300 బైక్‌లతో యువకు లు ర్యాలీలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ భార్య శిరీషా మాట్లాడుతూ ఎమ్మెల్యేగా నరేంద్రవర్మను, ఎంపీగా తెన్నేటి కృష్ణప్రసాద్‌లను భారీ మెజార్టీతో గెలిపిం చాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో చింతాయపాలెం సర్పంచ్ పీటా శ్రీనివాసరావు, జనసేననాయకులు నామన శివన్నారాయణ, పెదమల్లు మార్కండేయులు, ఏనుగు ఏడుకొండలు, నక్కల వెంకటస్వామి, ఏపూరి భూపతిరావు, పెదమల్లు ఉదయ చంద్రరావు, గొట్టిముక్కల వెంకటేశ్వర్లు, నల్లూరి రాంబాబు, దొప్పలపూడి వెంకటేశ్వర్లు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నిజాంపట్నంను మరింత అభివృద్ధి చేస్తాం

● ప్రజలు అండగా నిలవండి

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



నిజాంపట్నంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మే 9 : టీడీపీ కూటమితోనే నిజాంపట్నాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. నిజాంపట్నంలో గురువారం ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఇంటింట ప్రచారం నిర్వహించారు. నిజాంపట్నంలోని మత్స్యకారులు, ఆర్యవైశ్యులు, ముస్లీంలు పెద్ద సంఖ్యలో పాల్గొని అనగానికి బ్రహ్మరథం పట్టి పూలవర్షాన్ని కురిపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపట్నంలో రూ.100 కోట్లతో రహదారులు, మత్స్యకారులకు సబ్సిడీ రుణాలు, వలలు, బోట్లు అందించామన్నారు. ఆక్వా రైతులకు యూనిట్ రూపాయికే అందించి సబ్సిడీపై యంత్రాలను అందించిన ఘనత టీడీపీదేనన్నారు. నిజాంపట్నం హార్బర్ రహదారి అభివృద్ధి చేశామని, కొత్తపాలెం, నిజాంపట్నం హార్బర్‌లో తుఫాన్ షెడ్లు నిర్మాణంతో పాటు జట్టీలు నిర్మించామన్నారు. నిజాంపట్నం ప్రజలు నాకు ఎప్పుడూ అండగానే ఉంటారని, మీప్రేమ ఆదరాభిమానాలకు రుణపడి ఉంటానని, మీకు ఏ చిన్న సమస్య వచ్చినా అండగా ఉంటానన్నారు. ఎలాంటి భయాందోళన చెందకుండా స్వేచ్ఛగా ఓటు టీడీపీకే వేయాలని అన్నారు. కొంతమంది నాయకులు ప్రలోభపెడతారని దానికి బానిసకాకూడదన్నారు. రానున్నది టీడీపీ కూటమి నేనని నిజాంపట్నం మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని ప్రజలు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునే విధంగా సంతోషంగా ఉండే విధంగా అండగా ఉంటానన్నారు. నిజాంపట్నం, కొత్తపాలెం గ్రామాల్లో రూ.16 కోట్లతో సీసీ రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నర్రా సుబ్బయ్య, బొమ్మిడి రామకృష్ణ, ఓగిబోయిన వెంకట్‌యాదవ్, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, కొలసాని రాము, గుర్రం మురహరిరావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ మత్తి భాస్కరరావు పాల్గొన్నారు.



నిజాంపట్నంలో ఎమ్మెల్యే అనగానిపై పూలవర్షం కురిపిస్తున్న మహిళలు, టీడీపీ నాయకులు

టీడీపీ కూటమితోనే దళితులకు మేలు

● జగన్ 80 శాతం దళితుల ఓట్లతో గెలిచి వారికే తీరని ద్రోహం

● కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు



ఆనందబాబును సన్మానిస్తున్న ముస్లిం మైనారిటీలు

అమృతలూరు, మే 9 : బైబిల్, క్రైస్తవ్యాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రంలోని 80 శాతం దళిత ఓట్లతో గద్దెనెక్కిన జగన్ దళితజాతికి ఏం ఒరగబెట్టాడో చెప్పాలని, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి, కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు ప్రశ్నించారు. మండల పరిధిలోని ఇంటూరులో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో అడుగడుగునా ఆయనకు జనం నీరాజనాలు పలికారు. గుమ్మడికాయలతో దిష్టి తీసి హారతులు పట్టారు. భారీ జనసందోహం మధ్య ప్రచార రథంలో రోడ్‌షో ద్వారా గ్రామ పురవీధుల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్ పాలనలో దళితులపై అత్యాచారాలు, హత్యలు, అవహేళనలు, తప్పుడు కేసులు పెట్టి వేధించారన్నారు. దళితుల కోసం ఒక్క ప్రత్యేక కార్యక్రమం ఏమైనా చేశాడా అని ప్రశ్నించారు. పైగా చంద్రబాబు దళితుల కోసం ప్రవేశపెట్టిన 27 పథకాలను రద్దు చేయడంతో పాటు అంబేద్కర్ విదేశీ విద్య పేరును రద్దు చేసి తన పేరు పెట్టుకుని అంబేద్కర్‌ను అవమానపరిచాడన్నారు. ఇవన్నీ దళితజాతి ఆలోచన చేయాలని, మరోసారి తప్పు చేయవద్దని సూచించారు. తనపై ఉన్న కేసుల నుంచి రక్షణ పొందేందుకు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని చూస్తున్నాడని, ఇందుకోసం కుట్రలు, కుయుక్తులు, మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నాడన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సారధ్యంలో ఏర్పడే కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందజేయడం జరుగుతుందన్నారు. సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లగలిగే దార్శనికుడు చంద్రబాబు అన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటును సైకిల్ గుర్తుపై వేసి తనతో పాటు పార్లమెంట్ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. తొలుత భారీ గజమాలతో ఆనందబాబుకు గ్రామస్తులు బాణాసంచా, తప్పెట్లతో ఘనంగా స్వాగతం పలికారు. నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్, జనసేన జిల్లా అధ్యక్షురాలు సోమరౌతు అనురాధ, టీడీపీ నాయకులు కాట్రగడ్డ లక్ష్మీప్రసాద్, బోరుగడ్డ శామ్యూల్, ఆనంద్, పాములపాటి వెంకటసుబ్బారావు, కఠారి రాణి, బుచ్చిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.




మహిళలతో ముచ్చటిస్తున్న ఆనందబాబు

నేడు దోనేపూడితో పాటు లంక గ్రామాల్లో ఆనందబాబు ప్రచారం

కొల్లూరు, మే 9 : టీడీపీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు శుక్రవారం కొల్లూరు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ గురువారం తెలిపారు. దోనేపూడిలో ఉదయం 8.30 గంటలకు ఆనందబాబు పాల్గొంటారని, దోనేపూడి అనంతరం జువ్వలపాలెం పంచాయితీ పరిధిలో, సాయంత్రం 4 గంటలకు చావలి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరుగుతుందని అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేపల్లెలో భారీ వర్షం



జలమయమైన రేపల్లె పద్మావతి టాకీస్‌రహదారి

రేపల్లె, మే 9 : రేపల్లె నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన వర్షం ఎడతెరిపి లేకుండా రెండు గంటల పాటు కురవటంతో పట్టణంలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఆటంకం నెలకొంది. మురుగుకాల్వలు పూడికతీయకపోవటంతో రహదారులపైనే గంటల తరబడి నీరు నిలబడటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కోతకు వచ్చే సమయంలో ఈదురుగాలులు, వర్షం దాటికి మామిడికాయలన్నీ నేలవాలిపోయాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

● వేమూరు, మే 9 : మండల పరిధి గ్రామాల్లో గురువారం ఉదయం 11 నుంచి గంటకు పైగా విస్తృతంగా ఈదురు గాలులు వీచాయి. బారీ వర్షం పడింది. పలు గ్రామాల్లో చెట్లతో పాటు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో రాత్రి ఏడు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అక్కడక్కడ చేల లో రాశులుగా ఉన్న మొక్కజొన్న పంటలను వర్షానికి తడవకుం డా ఉండేందుకు రైతులు పట్టాలు కప్పి చర్యలు తీసుకున్నారు.

● కొల్లూరు, మే 9 : కొల్లూరుతో పాటు మండల గ్రామాల్లో పలు చోట్ల ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. కొల్లూరులోని పలు ప్రాంతాల్లో వర్షం ధాటికి మురుగు కాల్వలు పొంగి పొర్లడంతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో తెనాలి-రేపల్లె ప్రధాన రహదారిపై ఒక చెట్టు విరిగిపడటంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

వేమూరు, మే 9 : మండలంలోని జంపని, చావలి గ్రామాలకు చెందిన 26 కుటుంబాల వైసీపీ కార్యకర్తలు గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ ఆయన టీడీపీ కండువాలు కప్పి స్వాగతించారు. రాష్ట్ర టిడిపి మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, న్యాయవాది జయప్రకాష్ వేల్పుల రవి, వట్టిప్రోలు యోబు, టీడీపీ మండల అధ్యక్షుడు దండే వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.



ఆనందబాబు సమక్షంలో టీడీపీలో చేరిన చావలి వైసీపీ కార్యకర్తలు

రానున్నది ఎన్డీయే కూటమి ప్రభుత్వమే : అనగాని

రేపల్లె, మే 9 : రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వమే అధికారంలోకి రానున్నదని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిజాంపట్నం మండలం ముత్తుపల్లి పంచాయతీ మరకావారిపాలెంకు చెందిన వైసీపీ నాయకులు తుమ్మా రాంబాబురెడ్డి, పిట్టు రాఘవారెడ్డి, శ్రావణం దుర్గారెడ్డి, మైలా కోటేశ్వరరావు, వంశీ, మరాక భూషణం, మరకా శివనాగరాజు, మైలా సాంబశివరావు, మరాక శ్రీనివాసరావు, మరో 30 కుటుంబాలకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాలుగురోజులు కష్టపడి పనిచేసి ప్రతి ఒక్కరూ తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, కొలసాని రాము, ఓగిబోయిన వెంకట్‌యాదవ్, పూషడపు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



మరకావారిపాలెం వైసీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం : అఖిలేష్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అఖిలేష్

భట్టిప్రోలు, మే 9 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తనయుడు నక్కా అఖిలేష్ తెలిపారు. మం డలంలోని సూరేపల్లి పంచాయతీ తాతావారిపాలెంలో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి ప్రధాన సమస్యగా ఉన్న మెయిన్‌రోడ్డును నిర్మిస్తామని, శ్మశాన వాటికకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం చేయిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ వాకా శేషబాబు, నాయకులు యరగాళ్ళ సాంబయ్య, మోటూరు పుణ్యశ్రీనివాసరావు, గోవర్ధనగిరి నవీన్, రవిచంద్ర, గుర్రం నాగబాబు, సూరేపల్లి, తాతావారిపాలెం గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలుమూరు, అనంతవరంలో నక్కా అఖిలేష్ ప్రచారం

కొల్లూరు, మే 9 : మండలపరిధిలోని చిలుమూరు, అనంతవరంలో కూటమి అభ్యర్థి ఆనందబాబు తనయుడు డాక్టర్ అఖి లేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురువారం రెండు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి బాబు సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ప్రచారంలో ఆయనతో పాటు ఆయా గ్రామా ల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ కూటమినే భవిష్యత్తు : డాక్టర్ అనగాని కమల



పండ్ల వ్యాపారిని ఓటు అభ్యర్థిస్తున్న డాక్టర్ అనగాని కమల

రేపల్లె, మే 9 : టీడీపీ కూటమి ఇచ్చిన 25 హామీలతో ప్రజల బతుకులు మార్చేస్తాయి.. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెంది సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే అనగాని సోదరి డాక్టర్ అనగాని కమల అన్నారు. రేపల్లె పట్టణంలో 10, 11, 12, 14వ వార్డులో అనగాని గెలుపు కోసం గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రవేశపెట్టిన ఎన్నికల హామీలను వివరించారు. ఎన్డీయే కూటమి అభ్యర్థి అనగానికి అండగా ఉండి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తద్వారా రేపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయటంతో పాటు అందరికి అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో అనగాని కుటుంబ సభ్యులు భవిత, నాగలక్ష్మి, ఉదయశ్రీ, వర్ధిని, శ్రీలక్ష్మి, సివి, తుమ్మల శాంతి, భార్గవి, రాజేశ్వరి, మల్లేశ్వరి, హైమా, టీడీపీ నాయకులు గోగినేని పట్టాభి రామారావు, పంతాని సాయికుమార్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, పర్చూరి విజయ్‌కుమార్, యార్లగడ్డ బుల్లిబాబు, ల్యాబ్‌కిషోర్, ముమ్మలనేని గోపి పాల్గొన్నారు.

కూటమికే యానాది మహానాడు మద్దతు : తిరుమలశెట్టి

చుండూరు మే 9: రాష్ట్రంలో టీడీపీ పాలనలోనే యానాది వర్గీయులకు సామాజిక న్యాయం, రాజకీయ ప్రాధాన్యం లభించింద ని యానాది మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను తెలిపారు. గురువారం మండలంలోని చినపరిమి యానాది కాలనీలో నక్కా ఆనందబాబుకు మద్దతుగా సమావేశం, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలశెట్టి శ్రీను మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఎస్టీ వర్గాలకు గతంలో కంటే అధిక ప్రాధాన్యం కల్పిస్తానని అనేక వాగ్దానాలు చేసి మరచిపోయి వారిని అణగదొక్కారు. టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈగా రామదాసు మాట్లాడుతూ యానాదులు తెలుగుదేశం అభ్యర్థి ఆనందబాబుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు రమేష్‌నాయక్, కారుమంచి సుబ్బారావు, కందుకూరి రామకృష్ణ, దుర్గాప్రసాద్, పొట్లూరి ఆదినారాయణ, అంకమ్మరావు, స్థానిక పార్టీ నాయకుడు మర్రెరెడ్డి అయ్యపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన కేతనం

బాపట్ల జిల్లా వార్తలు

8

ఆంధ్రజ్యోతి

శుక్రవారం 10 మే 2024



సైకిల్ జోరు






- జిల్లాలో పసుపుగాలి
- కూటమికి జై కొడుతున్న ఓటర్లు
- మార్పు కోరుకుంటున్న జిల్లా వాసులు
- టీడీపీ మేనిఫెస్టోపై చర్చ.. అభివృద్ధిపై నమ్మకం

బాపట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న పరిణా మాల నేపథ్యంలో జిల్లా ఓటర్లు మార్పు కోరుకుంటున్నారు. ఈ పరి స్థితుల్లో జిల్లాలోని లోక్‌సభతో పాటు అసెం బ్లీ నియోజకవర్గాల్లో పసుపుగాలి వీస్తోంద న్న సంకే తాలు స్పష్టంగా కనిపిస్తోన్నాయి. అన్ని వర్గాల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని టీడీపీ రూపొందించిన మేని ఫెస్టోపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి జరుగుతుందనే నమ్మకం ఓటర్లలో వచ్చేసింది. ఈ పరిణామాలు టీడీపీ అభ్యర్థులకు ఓటర్లు పట్టం కట్టనున్నా రని తెలియజేస్తున్నాయి. ప్రజల నాడి కూటమి అభ్యర్థుల వైపే ఉందని గమనిం చిన వైసీపీ అభ్యర్థులు చాలా చోట్ల కాడి వదిలేశారని సమాచారం. బాపట్ల లోక్‌సభ తో పాటు ఆరు నియోజకవర్గాల్లో కూటమి క్లీన్ స్వీప్ ఖాయంగా కనిపించడంతో పసు పు సైన్యం కదం తొక్కుతోంది.

చేరికలతో టీడీపీ జోరు మీద ఉండగా.. ప్రచార దశలోనే కాడి కింద పడేసిన వైసీపీ నైరాశ్యంలో మునిగిపోయింది. పోలింగ్ సమీపిస్తోన్న కొద్దీ తెలుగు తమ్ముళ్లలో ఉత్సాహం ఉరకలెత్తుతోంది. రోజురోజుకూ పాలకపార్టీలో పరిస్థితి దిగజారిపోతోంది. ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు ఆయా నియోజక వర్గాల్లో వైసీపీ నేతలు యథేచ్ఛగా చేసిన దోపిడీతో ఓటర్లు కూటమి అభ్యర్థుల వైపే మొగ్గు చూపుతున్నారు.

రేపల్లె..అనగాని అడ్డా



రేపల్లె నియోజకవర్గంలో మరోమారు పసుపు జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తోంది. రేపల్లెలో మూడు రోజుల క్రితం జగన్ సిద్ధం సభ జనం లేక వెలవెల పోవడంతో వైసీపీ శ్రేణులు మరింత ఢీలా పడ్డాయి. మరోవైపు ఎమ్మెల్యే అనగాని సొంత సామాజిక వర్గ ఓటుబ్యాంకుకు గండి కొట్టడానికి వైసీపీ ప్రయోగించిన ఈవూరు గణేష్ అస్త్రం బెడిసి కొట్టింది. తీర ప్రాంతంలో సహజ వనరుల దోపిడీ తో పాటు పేకాటకు కేరాఫ్‌గా నియోజకవర్గాన్ని మార్చేశారనే విమర్శలను వైసీపీ నేతలు ఎదుర్కొంటున్నారు. ఐదేళ్లుగా అధికారపార్టీ నేతల దోపిడీ పర్వంతో పాటు అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఎమ్మెల్యే అనగాని విజయవంతమయ్యారు. దీంతో రేపల్లె గడ్డ అనగాని అడ్డా అని నిరూపించడానికి ఓటర్లు సిద్ధమైనట్లు స్పష్టంగా కనబడుతోంది.

పర్చూరులో హ్యాట్రిక్ దిశగా..



పర్చూరు నియోజకవర్గంలో 2014-19 మధ్య చేసిన అభివృద్ధే ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును హ్యాట్రిక్ విజయం దిశగా నడిపిస్తోంది. ఈ ఐదేళ్లలో పాలకపార్టీ నియోజక వర్గంలో చేసిన విధ్వంసం, దందాలు అన్ని వర్గాల ప్రజలను అతలాకుతలం చేశాయి. ఓట్ల అక్రమాల విషయంలో వైసీపీ నేతలు చేసిన కుట్రలను ఛేదించే క్రమంలో వైసీపీ కక్ష సాధింపులకు కూడా ఎదురొడ్డి పోరాడడంలో ఎమ్మెల్యే ఏలూరి విజయం సాధించారు. ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని చినగంజాం మండలం రొంపేరు వారధిని పూర్తి చేసిన ఘనత ఏలూరిదే. సాగర్ కాల్వలను ఆధునీకీకరించి చివరి ఆయకట్టు వరకు నీరందేలా చేసి రైతుల కష్టాలు తీర్చారు. వైసీపీ ప్రయో గించిన కాపు సామాజిక వర్గ అభ్యర్థి అస్త్రం వికటించడంతో పాటు వైసీపీ శ్రేణులు పెద్దఎత్తున టీడీపీ బాట పట్టాయి. కూటమి పార్టీల సహకారం కూడా తోడవడంతో ఏలూరి హ్యాట్రిక్ గెలుపు పక్కా అనే అంచనాలు కనిపిస్తున్నాయి.

ఈ సారి టీడీపీ ఖాతాలో బాపట్ల



రెండు దశాబ్దాల తర్వాత అంటే నాలుగు పర్యాయాల అనంతరం బాపట్ల టీడీపీ ఖాతాలో పడనున్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే కోన రఘుపతిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. దీనికితోడు భారీ సంఖ్యలో ఉన్న అధికారపార్టీ సొంత సామాజిక వర్గం ఈ దఫా టీడీపీ వైపే మొగ్గు చూపనున్నదని తెలుస్తోంది. దశాబ్దకాలంగా నియోజక వర్గంలో కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ చేస్తున్న సేవా కార్యక్రమాలు కూడా ఆయన గెలుపునకు దోహద పడే అంశాలుగా కనబడుతున్నాయి. జనసేన, బీజేపీ ప్రభావంతో వర్మకు అదనపు బలం తోడైంది. దీంతో సుదీర్ఘ కాలం తర్వాత భావపురిలో టీడీపీ జెండా ఎగరడం ఖాయమనే ధీమాను టీడీపీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి.

విజయాల పరంపరలో గొట్టిపాటి



అద్దంకి నియోజకవర్గంలో ఈ దఫా ఎలాగైనా వైసీపీ జెండా ఎగరవేయాలనే సంకల్పంతో వైసీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడడంతో పాటు వలస నేతను తీసుకొచ్చి ఇక్కడ హంగామా చేయాలనే వ్యూహాలు బెడిసికొట్టాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ప్రజలతో ఏళ్లుగా మెరుగైన సంబంధాలు కొనసాగిస్తున్నారు. దాదాపు ప్రతి గ్రామంలోని అన్ని పార్టీల నాయకులను పేరు పెట్టి పిలిచే చొరవ ఆయన సొంతం. ఇదే కాకుండా పార్టీలకతీతంగా ఎవరికి ఏ కష్టం వచ్చినా స్పందిస్తారనే మంచిపేరు రవికుమార్‌కు ఉంది. జగన్ బంధువు వైవీ సుబ్బారెడ్డి సిఫార్సుతో అభ్యర్థిగా ఖరారైన పాణెం హనిమిరెడ్డికి సొంత పార్టీ శ్రేణుల నుంచే మద్దతు కరువైంది. ఇంకోవైపున వైవీ వ్యవహార్‌శైలితో పోసగని వైసీపీ శ్రేణులతో పాటు బాలినేని వర్గం కూడా హనిమిరెడ్డికి దూరంగా ఉంటోంది. అన్నివర్గాల ప్రజలను కలుపుకోవడంతో పాటు రాజకీయ వ్యూహాలతో తన వరుస విజయాల పరంపరను ఎమ్మెల్యే గొట్టిపాటి కొనసాగించనున్నారు.

వేమూరు.. ఆనందబాబుదే



వేమూరు నియోజకవర్గంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మరోమారు పాగా వేయడం ఖాయమని తెలుస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి నాగార్జున ఈ ఐదేళ్లలో చేసిన దోపిడీనే ప్రధాన అంశంగా ఆనందబాబు ప్రచారం చేస్తున్నారు. సిట్టింగ్‌పై ఉన్న వ్యతిరేకత తప్పించుకోవడానికి వైసీపీ చేసిన అభ్యర్థి మార్పు ప్రయోగం వికటించింది. వైసీపీ శ్రేణుల నుంచే వలస అభ్యర్థికి సహకారం దక్కకపోవడం ఒక ఎత్తయితే ఆయన వ్యవహార్‌శైలితో వైసీపీకి మరింత నష్టం చేకూరుతోంది. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులకు తోడు ఇక్కడ గెలిచి మంత్రిగా ఉన్న వ్యక్తి చేసిన అరాచకాలపైనే ప్రధానంగా ఆనందబాబు దృష్టి పెట్టి ప్రచారం చేస్తున్నారు. మరోవైపు స్థానికత అంశం కూటమి అభ్యర్థికి అదనపు బలంగా ఉంది. దీంతో వేమూరు పీఠం ఖాయంగా నక్కా ఆనందబాబుదే.

చీరాలలో.. విజయతీరం చేరేలా



చీరాలలో కూటమి అభ్యర్థి ఎంఎం.కొండయ్య విజయ తీరం చేరేలా కష్ట పడుతున్నారు. ప్రతికూల పరిస్థితుల్లో టీడీపీ పగ్గాలు చేపట్టిన ఆయన ఇటీవల అధినేత చంద్రబాబు ప్రజాగళం సభ వేదికగా తన సత్తా నిరూపించుకున్నారు. టీడీపీకి అండగా నిలబడే బీసీ ఓటుబ్యాంకును ఏకం చేయడంలో ప్రణాళికబద్ధంగా వ్యవహరించి విజయం సాధించగలిగారు. మరోవైపు 2019లో టీడీపీ నుంచి గెలిచి వైసీపీలోకి వెళ్లిన కరణం బలరాం కృష్ణమూర్తి కుమారుడు వెంకటేష్ వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. దీంతో ఇక్కడ త్రిముఖ పోటీ జరుగుతుంది. కూటమి అభ్యర్థి కొండయ్య మాత్రం తనదైన శైలిలో పావులు కదుపుతూ సొంత సామాజికవర్గం(యాదవ) ఓట్లను గంపగుత్తగా తన ఖాతాలో పడేలా వ్యూహాలు రచిస్తున్నారు. గతంలో వైసీపీ గూటికి చేరిన టీడీపీ క్యాడర్‌ను తిరిగి సొంత ఇంటికి తెచ్చుకోవడంలో ఆయన చాలావరకు సక్సెస్ అయ్యారు.

నందిగంపై వ్యతిరేకతే తెన్నేటికి వరం



బాపట్ల లోక్‌సభ వైసీపీ అభ్యర్థి నందిగం సురేష్‌పై ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకతే కూటమి అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌కు వరంగా మారనుంది. దీనికి తోడు ఈ ఐదేళ్లలో ఎంపీ సురేష్ అధికారం అండతో చేసిన దౌర్జన్యాలతో పాటు నియోజకవర్గంపై కన్నెత్తి చూడలేదనే విమర్శనూ ఎదుర్కొంటున్నారు. మరోవైపు కూటమి అభ్యర్థి కృష్ణప్రసాద్‌కు ఐపీఎస్ అధికారిగా ఉన్న క్లీన్ ఇమేజ్ బలంగా ఉంది. చంద్రబాబు సారథ్యంలో పలు ప్రాజెక్టుల విషయంలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించడం వంటివన్నీ ఆయనకు కలిసొచ్చే అంశాలు. కూటమి ఎంపీ అభ్యర్థికి ఉన్న ట్రాక్ రికార్డు వల్ల ఆయన గెలిస్తే నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందనే విశ్వాసాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ కలిసొచ్చి బాపట్ల లోక్‌సభ స్థానంలో కూడా పసుపు జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తోంది.



ట్రైనీ ఐపీఎస్‌లతో సమావేశమైన ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల జిల్లాకు 9 మంది ట్రైనీ ఐపీఎస్‌లు

బాపట్ల, మే 9: బాపట్ల జిల్లాకు 9మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులు వచ్చారు. వారితో ఎస్పీ వకుల్ జిందాల్ సమావేశం అయ్యారు. ఎన్నికల నియమావళి సమర్థంగా అమలు చేస్తున్న విధానం గురించి వివరించారు. ప్రశాంతమైన వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లాలో భద్రతా పరమైన చర్యలు గురించి వారికి తెలిపారు. బాపట్ల, చీరాల, రేపల్లె సబ్ డివిజన్‌లకు వారిని కేటాయించటం జరిగింది. శిక్షణకు వచ్చిన వారిలో అబిజిత్ తులసీరాపాటీల్, ప్రభాత్ లక్ష్మం లింబు, రిషబ్ హన్స్, శివం, వికాస్‌మీనా, వికాస్‌యాదవ్, మంజిత్‌కుమార్, మాటేంద్రాకుమార్ మీనా, మయాంక్ ముద్గిల్ ఉన్నారు.

సేవే.. భాగ్యం



- అదే నేను నమ్మిన సిద్ధాంతం
- ప్రజల కష్టాలు చూసి చలించా
- నియోజకవర్గ ప్రజలకు సేవకునిగా పనిచేస్తా
- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మే 9: బాపట్ల అసెంబ్లీ స్థానం నుంచి తెలుగు దేశం, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగుతున్న వేగేశన నరేంద్రవర్మ రైతు కుటుంబంలో జన్మించారు. గుంటూరు మెడికల్‌స్టోర్‌లో గుమస్తాగా చేరి చిన్నవ్యాపారంతో ప్రారంభించిన ఆయన అంచలంచలుగా వ్యాపారవేత్తగా ఎదిగారు. బాపట్ల నియోజకవర్గంలో అనేక పరిశ్రమలు స్థాపించి 3,500మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నారు. శాసన సభ్యునిగా గెలిపిస్తే బాపట్లను రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, పలురంగాల్లో 15వేల మందికి ఉపాధి కల్పిస్తానని భరోసానిస్తున్నారు. ఆయన ఆలోచనలు ఆంధ్రజ్యోతితో ఈవిధంగా పంచుకున్నారు.

15వేలమందికి ఉపాధి కల్పిస్తా...

రెండు లక్షలకుపైగా జనాభా ఉన్న బాపట్ల నియోజకవర్గంలో నిరుద్యోగ యువత 15వేలమంది వరకు ఉన్నట్లు గుర్తించాం. వీరందరి వివరాలు వేగేశన ఫౌండేషన్ సిబ్బంది ద్వారా సేకరించి వివిధ పరిశ్రమల యాజమానులతో మాట్లాడి అక్కడ అవసరం ఉన్నవారిని అనుసంధానం చేసి ఉపాధి కల్పిస్తాం. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి కొత్తయూనిట్‌లు స్థాపించి స్వయం ఉపాధి పొందే విధంగా చర్యలు చేపడుతాం. శాసనసభలో నిరుద్యోగభూతాన్ని రూపుమాపటానికి నావంతు గళాన్ని వినిపిస్తా.

డ్రైనేజి వ్యవస్థ ఆధునికీకరించి..



బాపట్ల నియోజకవర్గంలో డ్రైనేజి వ్యవస్థ సరిగ్గా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ వ్యవస్థను ఆధునికీకరించి దోమల నిర్మూలనకు కృషి చేస్తాను. ప్రణాళిక బద్ధంగా డ్రైనేజి వ్యవస్థను ఆధునికీకరించి ప్రజల వెతలను తీరుస్తాను. గెలిచి వెంటనే సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించి ప్రజలకు మేలు జరిగేవిధంగా చూస్తాను.

తీర గ్రామాలకు హెచ్‌డీపీ లైన్ ద్వారా తాగునీరు....

నియోజకవర్గంలోని సముద్ర తీరప్రాంత గ్రామాలకు హెచ్‌డీపీ లైన్‌లు వేసి తాగునీరు అందిస్తాం. ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపడుతా. బాపట్ల జిల్లా కేంద్రం కావటంతోపాటు పెరిగిన జనాభా దృష్టా పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా అదనపు సమ్మర్‌స్టోరేజి ట్యాంక్ ఏర్పాటు చేస్తా. మరో సమ్మర్‌స్టోరేజి ట్యాంక్‌తోపాటు అవసరమైన ప్రతిచోట ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూస్తా.

నిజాయితీగా పనిచేస్తా...

కష్టాన్ని ఇష్టంగా భావించి చేపట్టిన ప్రతి పనిలో విజయం సాధించాను. ప్రజలకు నిజాయితీతో కూడిన పాలనందించాలని ఎంతో కసితో రాజకీయాలలోకి వచ్చాను. ప్రజలకు మంచి పాలనందిస్తాను. సంపాదించుకోవటానికి రాజకీయాలలోకి రాలేదు. సంపాదించిన తర్వాతే రాజకీయాలలోకి వచ్చాను. వ్యాపారస్తులు, ఉద్యోగులు, ఇతర ఏరంగాన్ని అధికారం అడ్డుపెట్టుకొని వేధించే నీతిమాలిన పనులకు నేను దిగబోనని హామీనిస్తున్నాను.నిజాయితీగా నిబద్ధతతో ప్రజల సేవకోసమే పాటుపడుతానని ఘంటాపదంగా చెబుతున్నాను.

సాగునీటి వనరులు విస్తృతం చేస్తా...

నాలుగేళ్ళగా పంటకాల్వలలో పూడికతీతలు తీయకపోవటంతో రైతుల వెతలు అన్నీఇన్నీ కాదు. చిన్నపాటి వర్షాలకే డ్రైనేజి పొంగి పొల్లాలోకి నీరు రావటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాల్వల మరమ్మతులు చేపట్టకపోవటంతో చివరి భూములకు నీరందక పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారు. అన్నదాతలను ఆదుకోవటమే ప్రధాన లక్ష్యంగా కార్యాచరణ ఉంటుంది. రైతుసంఘాల నాయకులతో చర్చించి వారి అగచాట్లు తీర్చటానికి శాశ్వత ప్రాతిపదికన ఏమి చేయటానికి అవకాశం ఉందో అన్నిటిని చేస్తాను. ప్రతిరైతుకు మేలు చేస్తాను.

టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తా..

బాపట్ల భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా పర్యాటక రంగం అభివృద్ధికి అత్యధిక అవకాశం ఉంది. తీరప్రాంత మొత్తాన్ని వైసీపీ చెరబట్టి వాతావరణ సమతుల్యాన్ని కూడా దెబ్బతీసింది. పర్యాటకరంగంలో బాపట్లను గోవా సరసన నిలబెట్టి వేలమందికి ఆరంగంలో ఉపాధి కల్పించే బాధ్యత నేను తీసుకుంటాను. తీరప్రాంతం అభివృద్ధితోపాటు పట్టణంలో స్పోర్ట్స్‌క్లబ్, ఇతర ఆటవిడుపు ప్రణాళికలపై కూడా దృష్టి పెడుతాం. ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఉన్న సూర్యలంక సముద్ర తీరం నుంచి చీరాల ఓడరేవు వరకు బాపట్లను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తాను. ఈవిధంగా అభివృద్ధి, సంక్షేమం లభిస్తాయి.

పేదల కష్టాలు రాజకీయాల వైపు నడిపించాయి....

వేగేశన ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించే సమయంలో పేద ప్రజలు పడుతున్న కష్టాలు ప్రత్యక్షంగా చూశాను. వారి కష్టాలు చూచి చలించిపోయి రాజకీయాలలోకి వచ్చి నాయకునిగా సేవలు విస్తరించాలని నిర్ణయించుకున్నాను. ప్రజల ఆకాంక్ష కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో పేదల సంక్షేమం కోసం నాకు, నా తండ్రికి ఇష్టమైన తెలుగుదేశంపార్టీ ద్వారా రాజకీయాలవైపు అడుగులు వేశాను. బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్నాను. ప్రజలు గెలిపించి శాసనసభకు పంపిస్తే బాపట్ల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తాను.



సజ్జావారిపాలెం- చెరుకుపల్లి రహదారి డబుల్‌లైన్ రహదారిగా అభివృద్ధి



కూచినపూడి పిట్టువారిపాలెం డబుల్‌లైన్ రహదారిని ప్రారంభిస్తున్న అప్పటి సీఎం చంద్రబాబు



రేపల్లె-పెనుమూడి డబుల్ లైన్ రహదారిగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే అనగాని



ఇసుకపల్లి-పల్లెకోన అడ్డరోడ్డు వరకు అనగాని అభివృద్ధి చేసిన డబుల్‌లైన్ సీసీ రోడ్డు

అభివృద్ధికి.. బాటలు

- తీరప్రాంత రహదారుల అభివృద్ధి అనగానికే సాధ్యం
- రహదారులు డబుల్ లైన్ రహదారులుగా అభివృద్ధి
- రూ.1500 కోట్లతో రహదారులకు కొత్త హంగు
- హర్షిస్తున్న నియోజకవర్గ ప్రజలు

రేపల్లె, మే9: నిత్యం ప్రజలతో మమేకం అవుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ అన్ని సామాజిక వర్గాలను కలుపుకుపోతూ గత 30 ఏళ్లుగా జరగని అభివృద్ధి 2014 నుంచి 2019లో టీడీపీ ప్రభుత్వ హయాంలో అయిదేళ్ళ కాలంలో చేసి రేపల్లె నియోజకవర్గ రూపురేఖలు మార్చిన ఘనత ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కే దక్కుతుంది. ప్రభుత్వం నుంచి నిధులు సేకరించటం, అభివృద్ధి చేయటంలో రేపల్లె నియోజకవర్గం ముందంజలో ఉంది. తీరప్రాంతంలోని వెనుకబడిన రేపల్లె నియోజకవర్గాన్ని అయిదేళ్ళలో రూ.1500 కోట్ల పైబడి నిధులు వెచ్చించి ప్రధాన రహదారులన్నీ డబుల్‌లైన్‌గా మార్చారు. జిల్లాలోనే ఎమ్మెల్యే అనగానికి ఒక ప్రత్యేక గుర్తింపు వుండటంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, సహచర మంత్రులతో సంప్రదించి కోట్లాది రూపాయల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తూ అనగాని అందరివాడు అనిపించుకున్నారు.

గ్రామాల్లో రహదారులకు మహర్దశ

టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే అనగాని రహదారులపై ప్రత్యేక దృష్టి సారించి పంచాయితీ రాజ్ శాఖ ద్వారా రూ.1500 కోట్ల రెండు వేల కి.మీ మేర గ్రామాల్లో సీసీ రోడ్లను అభివృద్ధి చేశారు. దీంతో ఏ గ్రామంలోకి వెళ్ళినా రహదారి సమస్య అనేది లేకపోవటంతో ప్రజలు టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే రహదారుల అభివృద్ధి చేశారంటూ గ్రామాల్లోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఐదేళ్ళ పాలనలో కనీసం ప్యాక్స్ వర్కులు కూడా చెయ్యని పరిస్థితి నెలకొంది.

డబుల్‌లైన్ రహదారులుగా అభివృద్ధి..

నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో రేపల్లె- పెనుమూడి, పెనుమూడి-మోర్తోట, సజ్జావారిపాలెం-అడవులదీవి, సజ్జావారిపాలెం -నగరం -చెరుకుపల్లి, బేతపూడి -పల్లెకోన, రేపల్లె- వేజళ్ళవారి లంక, నిజాంపట్నం - హార్బర్ వరకు ప్రధానమైన డబుల్‌లైన్ అరవపల్లి ఉంచి రుద్రవరం టిడ్కో గృహాల వరకు డబుల్‌లైన్ రహదారిని అభివృద్ధి చేశారు. నిజాంపట్నం పట్నం అచ్చుతపురం గ్రామంలో కిలోమీటరు డబుల్ లైన్ సీసీ రహదారిగా అభివృద్ధి చేశారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే అనగానికి ప్రతి ఒక్కరూ అండగా ఉంటామన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు..



తీరప్రాంతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాదిరూపాయలు నిధులు వెచ్చించి రహదారులు అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే అనగానికే దక్కుతుంది. 60ఏళ్ళలో ఈ రహదారి అభివృద్ధికి నోచుకోక సింగిల్ లైన్ రహదారిగా ఉండేది. సజ్జావారిపాలెం నుంచి చెరుకుపల్లి వరకు 15 కిలోమీటర్లు మీరారహదారి డబుల్ లైన్ రహదారిగా అభివృద్ధి చేశారు. పట్టణం నడిబొడ్డున రెండు కిలోమీటర్ల మేర సీసీ రహదారి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చారు.

- మేకా వెంకట శివరామకృష్ణ, మాజీ జడ్పీటీసీ, నగరం మండలం

తీరం అభివృద్ధి అనగానితోనే సాధ్యం...



తీరప్రాంతం అభివృద్ధి చెందాలంటే అనగానితోనే సాధ్యం. నగరం మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రతి గ్రామంలో అంతర్గత సీసీ రహదారులు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ కార్యాలయాలు, రైతులకు నీరు అందించే విధంగా లిఫ్ట్ ఇరిగేషన్‌లు ఏర్పాటు చేసి వేలాది ఎకరాలకు సాగునీరు అందించి పంటకాలువలను పూడికతీతలు, మరమ్మత్తులు నిర్వహించింది అనగాని సత్యప్రసాద్.

- విచారపు వీరయ్య, మాజీ ఎంపీపీ

అభివృద్ధికి చిరునామా అనగాని....



టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే అనగాని రేపల్లె పెనుమూడి రుద్రవరం నుంచి మోర్తోట వరకు డబుల్‌లైన్ రహదారిగా అభివృద్ధి చేసి ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. గ్రామాల్లో మినీ వాటర్‌స్కీమ్‌ను ఏర్పాటు చేసి సాగునీటి సమస్య తలెత్తకుండా అభివృద్ధి చేశారు. పుష్కరాల సమయంలో కృష్ణానది పరివాహక ప్రాంతమంతా అభివృద్ధి చేసి పాఠశాలలు భవనాలు నిర్మించి బ్యాంక్ కెనాల్‌పై పుట్‌బ్రిడ్జిని నిర్మించి రైతుల రాకపోకలకు ఎంతో దోహదపడ్డారు.

- తొట్టెంపూడి సుభాష్, మాజీ సర్పంచ్

ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలి

- అభివృద్ధి.. సంక్షేమమే నా లక్ష్యం
- పర్చూరును అగ్రగామిగా నిలుపుతా
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి

పర్చూరు, మే 9 : రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి ప్రభుత్వమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు పిలుపు నిచ్చారు. బుధవారం రాత్రి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో పెద్ద ఎత్తున ఆయా మండలాలకు చెందిన వైసీపీ శ్రేణులు ఏలూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ కూటమి ప్రభంజనంతో ఫ్యాన్ రెక్కలు ముక్కలు కావడం ఖాయమన్నారు. ఐదేళ్ల పాటు ప్రజలను మోసం చేసిన జగన్ మళ్లీ మోసం చేయాలని చూస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు వైసీపీ పాలనలో విసిగి వేసారారన్నారు. భవిష్యత్ తరాల బంగారు బాట వేసేందుకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి కట్టిందన్నారు. ప్రజా కూటమి కురక్షేత్రంలో అవినీతి అహంకార వైసీపీ ఇంటికి పోవడం ఖాయమన్నారు. దళితులు, మైనార్టీలు, బీసీలను బడుగు బలహీన వర్గాలను హింసించి చంపి డోర్ డెలివరీ చేసిన పార్టీ వైసీపీ అన్నారు. ఆ పాపం ఎన్నికల్లో ఓటు ద్వారా పండుతుందన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి వైసీపీ అరాచక పరిస్థితిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని ఏలూరి సూచించారు.

ఎమ్మెల్యే సమక్షంలో చేరికల జోరు

పర్చూరు మండలం కొల్లావారిపాలెం గ్రామానికి చెందిన అడ్డగడ్డ గంగాధర్, అడ్డగడ్డ రవి, మందాటి శ్రీనివాసరావు, గంట సాయికృష్ణ తదితరులు టీడీపీలో పార్టీలో చేరారు. అదేవిధంగా పెద్దివారిపాలెం గ్రామానికి చెందిన అడ్డగడ్డ రామయ్య, ఇనగంటి రవీంద్ర బాబు తదితరులు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో చేరారు. వారికి ఏలూరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. నాగులపాలెంకు చెందిన సాదు డేనియేలు, సాదు రాజు తెలుగుదేశం పార్టీలో చేరారు. మార్టూరు మండలం చిమ్మిరిబండకు చెందిన ప్రవీణ్ కుమార్, షేక్ అల్లాభక్ష్, తాళ్లూరి మస్తాన్, ప్రసన్నబాబు పార్టీలో చేరారు. అదేవిధంగా చిన్నగంజాం మండలం కొత్తపాలెంకు చెందిన బక్క విజయరామకృష్ణ, బక్క జాల రామిరెడ్డి, గాలిరమణారెడ్డి, గునిమిని నాగేంద్రరెడ్డి తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో చేరారు. జొన్నతాలికి చెందిన మట్టకోయ బాబూరావు, మట్ట కోయ నాగరాజు, కల్యాణ్, కోటేశ్వరావు, పల్లెపోగు వీరయ్య, ఉయ్యాల అంజయ్య, సుబ్బాయమ్మ, గోపి, అంకమ్మరావు, ఉయ్యాల సుజాత, అంజమ్మ చేరారు. ఉప్పుటూరుకు చెందిన కాలవ లక్ష్మీ ప్రసన్న, కాలువ సుబ్రహ్మణ్యం, ఇర్మియ, దాసు విజయమ్మ, అచ్చయ్య పల్లతోటి ప్రసాద్, భాస్కర్, బాలాజీ, షేక్ రహమాన్, షేక్ అలిముద్దీన్ పార్టీలో చేరారు. కారంచేడుకు చెందిన పిట్టు నవీన్, జంగిలి దినేష్, కొత్తగొర్ల వెంకటేష్, తాడిపల్లి గోపి, రావులపల్లి శివాజీ, కొత్త గొర్ల శ్రీనివాసరావు, సాతర్ల కల్యాణ్, ఎలవల్లి రామయ్య ఓసాబాబీ, పాలపర్తి వీరయ్య, మెట్ట కోటేశ్వరరావు, షైల బ్రహ్మయ్య పిట్టు ఉమామహేశ్వరరావు, ఏడుకొండలు, కలవకోలు వెంకటేష్, జువ్వా పోలయ్య ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో చేరారు.

సైక్కిల్ ఎక్కిన వైసీపీ నాయకులు

చినగంజాం, మే 9 : చినగంజాం, కొత్తపాలెం గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు సైకిలెక్కారు. మార్టూరు మండలం ఇసుకదర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సాంబశివరావు సమక్షంలో మండల పరిధిలోని వైసీపీ నాయకులు గురువారం టీడీపీలో చేరారు. కొత్తపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు బక్కా విజయరామకృష్ణ, బక్కా జాలిరెడ్డి, గాలి రమణారెడ్డి, గునిమిని నాగేంద్రరెడ్డి, చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మసీదుపేటకు చెందిన పలువురు వైసీపీ నేతలు ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో చినగంజాం గ్రామ పంచాయతీలోని ఇస్లాంపేటకు చెందిన వైసీపీ నాయకులు షేక్ మౌలాలి టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెరుకూరి రాఘవయ్య, సందు శ్రీనివాసరావు, మోటుమర్రి రామసుబ్బారావు, షేక్ జిలాని, టి.చిన్నా, షేక్ సలాం, షేక్.బాజీ, బయ్యా సతీష్ పాల్గొన్నారు.



ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన జొన్నతాళి ఎస్టీ కాలనీవాసులు

ద్రోణాదులలో ఏలూరికి ఘన స్వాగతం

మార్టూరు, మే 9 : ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి మండలంలోని ద్రోణాదుల గ్రామంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రా మంలోని ప్రధాన వీధులతో పాటు ఎస్సీ కాలనీల్లో కూడా ప్రచారం నిర్వ హిం చారు. ప్రచార రథంపై ఏలూరి పాటు మాజీ మంత్రి కేఎస్ జవహర్ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏలూరికి నాయకులు, కార్యకర్తలు, మహిళలు విశేషంగా స్వాగతం పలికారు. మహిళలు గుమ్మడి కాయలతో దిష్టి తీసి హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ప్రచార రథంపై ఉన్న ఏలూరి ప్రజలతో మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే చారిత్రాత్మక ఎన్నికలను మనం చూస్తున్నామన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రజలు సమర్థవంతమైన పాలన, శాంతి భద్రతల జీవన విధానం, బిడ్డల భవిష్యత్, రాష్ట్ర అభివృద్ధి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో విఫలమైందన్నారు. గ్రామాలలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీల్లో సిమెంట్ రోడ్లు వేసిన టీడీపీదేనన్నారు. రాష్ట్రాన్ని బాగు చేసేందుకు చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. రైతు కుటుంబాలను, వ్యవసాయాన్ని నీరు గార్చిన జగన్‌రెడ్డిని ఇంటికి పంపడానికి నాలుగు రోజుల మాత్రమే గడువుందన్నారు. అనంతరం గ్రామంలో ని ముస్లిం కుటుంబాలు, మైనారిటీలు ఏలూరిని కలిశారు. కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని మాటిచ్చారు. అంతకు ముందు ద్రోణాదుల శివారులో ఆటోలో వస్తున్న మహిళా కూలీలతో ఏలూరి మాట్లాడారు.



ద్రోణాదులలో ప్రచారం చేస్తున్న ఏలూరి, పక్కన మాజీ మంత్రి జవహర్

నేడు మహిళామణులతో ఆత్మీయ సమావేశం

ఏలూరి క్యాంపు కార్యాలయంలో టీడీపీ మహిళా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గ స్థాయిలో నారీ భేరి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏలూరి క్యాంపు కార్యాలయం గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఏలూరి హాజరుకానున్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి మహిళలు భారీగా హాజరుకావాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

ల్యాండ్ టైటిల్ భూ భక్షక చట్టం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

సంతమాగులూరు, మే 9 : ప్రజల భూములను కాజేసేందుకే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను జగన్‌రెడ్డి తీసుకొచ్చారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. మండల కేంద్రమైన సంతమాగులూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో గొట్టిపాటి రవికుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి మేనిఫెస్టోపై ప్రచారం నిర్వహించారు. 13 జరిగే ఎన్నికల రోజుతో జగన్ దుష్టపాలన అంతం కానుందన్నారు. కూటమి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని గొట్టిపాటి కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్‌లను జగన్‌రెడ్డి నిర్వీర్యం చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని కొత్త పథకాలను తెచ్చి ప్రజల ఆస్తులను కొల్లగొట్టేందుకు జగన్‌రెడ్డి కుట్ర చేస్తున్నారన్నారు. ఐదేళ్లు దోచింది చాలదన్నట్లు మళ్లీ అధికారంలోకి వచ్చి మొత్తం ప్రజల ఆస్తులను కొట్టేసేందుకు చట్టాలను తెస్తున్నారని అన్నారు. జగన్‌రెడ్డి మాటలను, మోసాలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ఓటుతో బుద్ధి చెప్పి గద్దె దింపాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ 2023 అక్టోబరు 31 నుంచే అమలులోకి వచ్చినట్టు వైసీపీ జీవో-512ని తెచ్చిందన్నారు. భూ భక్ష చట్టంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఎన్నికల్లో ప్రజల్ని మోసం చేయడానికి ఈ చట్టానికి ఇంకా మార్గదర్శకాలు ఇవ్వలేదంటూ ఇప్పుడు వైసీపీ నేతలు కొత్త నాటకాలు ఆడుతున్నారన్నారు. జగన్ రెడ్డి బినామీ కంపెనీ ఇండో సోల్ కంపెనీకి ఒక్క రామాయపట్నం పరిసరాల్లోనే 8,500 ఎకరాల రైతుల భూముల్ని కారు చౌకగా కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా జగన్ భూ మాఫియా కోసం ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను సిద్ధం చేశారన్నారు. అనంతరం సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు 50 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరారు.



గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

పలువురు టీడీపీలో చేరిక

అద్దంకి, మే 9 : మండలంలోని కుంకుబాడుకు చెందిన పలువురు వైసీపీ ఎస్సీ నేతలు గురువారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. అనపర్తి మార్క్, దావీదు, లూథర్, నూనె సైమన్ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మాజీ సర్పంచ్ చంద్ర బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన బల్లికురవ, చెన్నుపల్లి వాసులు

బల్లికురవ : బల్లికురవ గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరారు. చేరిన వారిలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు కందుకూరి పేతురు. బొంతా అరోను, బొంతా చినబాబు, కందుకూరి సుబ్బారావు, తంగిరాల ఆశోక్, తిరుపాలు, యేసు, సురేష్, చెన్నుపల్లి గ్రామానికి చెందిన దివ్వె రామాంజనేయులు, ఏల్చూరి అంజనేయులు, వెంకటేశ్వర్లు, వీరాస్వామి, ప్రసాద్ తదితరులు ఉన్నారు. వారందరికీ గొట్టిపాటి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పందిరి అంజిబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన బల్లికురవ ఎస్సీ కాలని వాసులు

వైసీపీకి కల్లంవారిపాలెంవాసులు గుడ్‌బై

పంగులూరు : మండలంలోని కల్లంవారిపాలెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు గురువారం టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన పత్తిపాటి దైవసాలు, గర్నెపూడి అంజయ్య, బొప్పూడి రమేష్‌తో పాటు మరి కొందరు గురువారం వైసీపీకి గుడ్‌బై చెప్పారు. వీరికి ఎమ్మెల్యే గొట్టిపాటి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, గుడిబండ్ల ఆదిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఉన్నతంగా ఎదిగేందుకే మహాశక్తి

గొట్టిపాటి ఝాన్సీ

పంగులూరు, మే 9 : మహాశక్తి పథకంలో మహిళలు సమాజంలో ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడుతుందని ఎమ్మెల్యే గొట్టిపాటి సతీమణి ఝాన్సీ అన్నారు. పంగులూరులో టీడీపీ కూటమి ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ ఝాన్సీ గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాబు సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఆడపిల్లల చదువుకు ఏడాదికి రూ.15వేలు, మహిళలకు నెలకు రూ.1500, ఏడాది మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఉపయోగకరమన్నారు. నిరుద్యోగులకు రూ.3వేల భృతి, నెలకు రూ.4వేల పింఛన్, డ్వాక్రా గ్రూపులకు వడ్డీలేని రూ.10లక్షల రుణం, రైతుకు రూ.20వేల పెట్టుబడి సాయం, దివ్యాంగుకు రూ.6వేల పింఛన్ వంటి పథకాలు పేదలను ఆర్థికంగా మేలు చేస్తాయన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో కరెంట్, బస్సు చార్జీలు, పన్నుల భారం, నిత్యావసరాల ధరలతో సామాన్యులు అల్లాడిపోయారన్నారు. కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకొని ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడాలని కోరారు. చంద్రబాబును సీఎంను చేసేందుకు 13న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యే, ఎంపీలను గెలిపించాలని ఝాన్సీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాచిన చెంచుప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, మాజీ సర్పంచ్ బాచిన నీరజ శ్రీనివాస్, మేడ సుబ్బారావు, గుర్రం ఆదిశేఖర్, చిలుకూరి కోటయ్య, నాగేశ్వరరావు, జాగర్లమూడి సుబ్బారావు, రంగారావు, చౌదరిబాబు, నాగార్జున, రామారావు, మహిళలు పాల్గొన్నారు.



పంగులూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఝాన్సీ



ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన కొణిదెన ఎస్సీ కాలనీ వాసులు

బల్లికురవ మండలంలో చేరికల జోరు

- సైకిలెక్కుతున్న వైసీపీ నాయకులు
- అన్ని గ్రామాల్లో గడపతట్టిన గొట్టిపాటి కుటుంబం
- భారీ మెజార్టీకి అవకాశముందంటున్న టీడీపీ నేతలు

బల్లికురవ, మే 9 : వైసీపీని వీడి టీడీపీలో చేరుతుఉన్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికే అత్యధిక గ్రామాలలో గత పది రోజుల వ్యవధిలో పలువురు ముఖ్య నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రధానంగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన గొట్టిపాటి రవికుమార్‌తో వైసీపీలో ఉన్న నేతలతో కూడా గతంలో సన్నిహిత సంబంధాలు ఉండడంతో కొందరు ఎన్నికల గడువు దగ్గర పడేకొద్దీ ఎమ్మెల్యే రవికుమార్‌కు మద్దతు ప్రకటిస్తున్నారు. టీడీపీ నేతలు కూడా గతంలో వైసీపీకి మెజార్టీ వచ్చిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి కొంత సఫలీకృతులయ్యారు. ఈసారి మండల స్థాయిలో గతంలో కంటే అత్యధిక మెజారిటీ రావడం తథ్యమని టీడీపీ నేతలు బెట్టింగ్‌లకు కూడా దిగుతున్నారు. 15రోజుల వ్యవధిలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన నాయకుల్లో కొణిదెనకు చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యులు తన్నీరు ఏడుకొండలు, అంబడిపూడి, నక్కబొక్కలపాడు, కేరాజుపాలెం సర్పంచ్‌లు షైలా కుసుమకుమారి, దూళిపాళ్ల బుల్లిరామయ్య, అమరనేని రమేష్‌బాబు, వల్లాపల్లికి చెందిన ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చింతల పేరయ్య, మాజీ సర్పంచ్ షేక్ అల్లా ఉద్దీన్, ఉప్పుమాగులూరు చెందిన జిల్లా పీడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ చిట్టిపోతు మస్తానయ్య అమరనేని భాస్కరరావు, చెన్నుపల్లికి చెందిన దివ్వె రామాంజనేయులు, కొనిదెన గ్రామానికి చెందిన పలువురు ఎస్సీ కాలనీ వాసులు మరియు మాజీ సర్పంచ్ కుంచపు అంజనేయులు, మల్లాయపాలెంకు చెందిన మాజీ సర్పంచ్ అబ్బారెడ్డి బాలకృష్ణ, నక్కబొక్కలపాడుకు చెందిన వైసీపీ ముఖ్యనేత కట్టాసుధాకర్, గొర్రెపాడుకు చెందిన మక్కెన స్వాములు, ముక్తేశ్వరం, వల్లాపల్లి, వైదన, కొప్పెరపాడు, వేమవరం, మల్లాయపాలెం, వెలమవారిపాలెం, గ్రామాలకు చెందిన పలువురు ఎస్సీ, బీసీ కాలనీ వాసులు ముస్లిం మైనారిటీలు సైకిలెక్కారు. దీంతో గ్రామాలలో టీడీపీ కేడర్‌లో నూతనోత్సాహం నెలకొంది. ఏ గ్రామంలో చూసినా టీడీపీకి మెజార్టీ వస్తుందని నేతలు అంటున్నారు. 2019 ఎన్నికల కంటే ఈ ఎన్నికలలో అత్యధిక మెజారిటీ వస్తుందని వారు అంటున్నారు. ఇప్పటికే పలు గ్రామాలలో ఎమ్మెల్యే గొట్టిపాటికి మద్దతుగా ఇంటింట ప్రచారం ప్రారంభించారు. ఎన్నికల గడువు దగ్గర పడుతుండడంతో ప్రచారం కూడా ఉపందుకుంది. రవికుమార్ కుటుంబ సభ్యులు మండలంలోని 33 గ్రామాలలో ఉన్న ప్రతి ఇంటిని తట్టి ప్రచారం జోరుగా కొనసాగించారు.

రోటరీ ఆధ్వర్యంలో చలివేంద్రం

పర్చూరు, మే 9: ప్రజాసేవే లక్ష్యంగా రోటరీ క్లబ్ పనిచేస్తుందని క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనవాసరావు అన్నారు. పర్చూరులోని బొమ్మల సెంటర్ కూడలిలో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉచిత చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంచినీటితోపాటు మజ్జిగను కూడా ఏర్పాటు చేశారు.

ఆదరించండి.. ఆజన్మాంతం రుణపడి ఉంటా



స్వతంత్ర అభ్యర్థి పోలిశెట్టిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొండయ్య.. కొండయ్యకు మద్దతుగా రంగా, హీరో నిఖిల్ ప్రచారం

- చైతన్యంతో ఆలోచించి.. ఆశీర్వదించండి
- కొండయ్య రాక ముందు.. వచ్చిన తరువాత
- పెరుగుతున్న మద్దతుదారులు
- ప్రచారంలో కూటమి దూకుడు
- మేము సైతం అంటూ

కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు

చీరాల, మే 9 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆయనకు మద్దతుగా కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు రామదండు మాదిరిగా అడుగులు వేస్తున్నారు. రోజురోజుకు కొండయ్యతో జతకడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. విపక్షాల నుంచి పార్టీలో చేరుతున్న పలువురు ప్రజాప్రతినిధులు, పోటీలో ఎన్నికల గుర్తు కూడా పొందిన తరువాత కొండయ్య మంచితనానికి ప్రభావితం అవుతూ టీడీపీలో చేరడం అందుకు నిదర్శనం. ఆదరించండి.. ఆ జన్మాంతం రుణపడి ఉంటాను అనే నినాదంతో కొండయ్య అడుగులు వేస్తున్నారు. నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ రుణం తీర్చుకుంటానని చెప్తున్నారు.

అదే బలం.. అదే బలహీనత

నిజం చెప్తాను. చెప్పింది చేస్తాను. అదే నా బలం. బహీనత అంటూ కొండయ్య ముందుకు సాగుతున్నారు. తనను వ్యతిరేకించిన వారిని కూడా తనతో కలుపుకుని ముందుకు సాగడం అందుకు దర్పణం పడుతోంది. ఎవరి మనస్సును నొప్పించకుండా తన లక్ష్యసాధన దిశగా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. చీరాల నియోజకవర్గంలోని కొన్ని సామాజికవర్గాల్లో కొందరు కొందరు నాయకులపై ప్రత్యేక ముద్ర ఉంది. అలాంటివారిని, వారిని వ్యతిరేకించే వారిలో ఎవరికిచ్చే ప్రాధాన్యత వారిస్తూ ముందుకు సాగడం అదనపు బలంగా మారింది కూటమి పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల చంద్రబాబు ప్రజాగళం సభ తరువాత కూటమికి మరింత ఊపొచ్చింది.

సూపర్‌సిక్స్, బీసీ డిక్లరేషన్‌తో అదనపు బలం

సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు. బీసీలు అత్యధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో బీసీ డిక్లరేషన్‌తో ఆయా సామాజికవర్గాల మద్దతు కూడగట్టడంలో సత్ఫలితాలు సాధిస్తున్నారు. ప్రచారంలో ఆ విషయాలనే ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు. ఇక ల్యాండ్ టైటిల్ యాక్ట్‌తో జరిగే నష్టాన్ని రైతులకు వివరించడంలో సానుకూల పవనాలు వీస్తున్నాయి.

మేము సైతం.. అంటూ కుటుంబ సభ్యులు

కొండయ్యకు మద్దతుగా కూటమి నాయకులు, శ్రేణులతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు మేము సైతం అంటూ కదం తొక్కుతున్నారు. ఆయన మేనల్లుడు సినీ హీరో సిద్ధార్థ నిఖిల్ ఎన్నికల ప్రచారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. యువతను ఆకర్షిస్తున్నారు. కొండయ్య కుమారులు గౌరీఅమర్‌నాథ్, మహేంద్రనాథ్‌తో పాటు కొండయ్య సతీమణి బాలకొండమ్మ, కుమార్తె శివనారాయణదేవి సైతం ఇంటింటి ప్రచారంలో పాల్గొంటున్నారు.

వంగవీటి రాధా ప్రచారంతో

చీరాల నియోజకవర్గంలో కాపుల సంఖ్య కూడా గణనీయంగానే ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల వంగవీటి రాధా నియోజపకవర్గంలో పలు ప్రాంతాల్లో కొండయ్యకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో కాపులు కూటమికి కాపుకాయాలని రాధా ఇచ్చిన పిలుపుకు మంచి స్పందన లభిస్తోంది.

టీడీపీలోకి జోరుగా చేరికలు

టీడీపీలోకి విపక్షాల నుంచి చేరికలు జోరుగా సాగుతున్నాయి. వైసీపీ కౌన్సిలర్లు ఉల్లిపాయల సుబ్బయ్య(పొత్తూరి సుబ్బయ్య), సూరగాని లక్ష్మి టీడీపీలో చేరారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి (గ్లాసు గుర్తు పొందిన)న ప్రజాబంధు ప్రగడ కోటయ్య మనుమడు కొండయ్యకు మద్దతు తెలిపి టీడీపీలో చేరారు. ఇక నియోజవకర్గంలో పలు గ్రామాలు, పట్టణంలోని పలు వార్డులకు సంబంధించి కొండయ్య సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వారు గణనీయంగా పెరుగుతున్నారు. దీంతో గెలుపు తమదేనని టీడీపీ, జనసేన, బీపేపీ శ్రేణులు పూర్తి స్థాయిలో విశ్వసిస్తున్నారు.

టీడీపీ కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయండి

మార్టూరు, మే 9 : పర్చూరు నియోజకవర్గంలో శాసనసభ్యునిగా పోటీ చేస్తున్న టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు, ఎంపీ కృష్ణప్రసాద్ గెలుపునకు ముస్లిం మైనారిటీలు కృషి చేయాలని టీడీపీ శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ పిలుపు నిచ్చారు. మార్టూరులో గురువారం రాత్రి ముస్లిం మైనారిటీల టీడీపీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా నాయకులు షేక్ రజాక్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచక పరిపాలనను అంత మొందించాలనే ఉద్దేశంతోనే టీడీపీ బీజేపీ పార్టీతో పొత్తు పెట్టుకుందన్నారు. అంతేగాని బీజేపీ పార్టీ విధానాలు, సిద్ధాంతాలతో టీడీపీకి సంబంధం లేదన్నారు. ఈ విషయమై వైసీపీ చేస్తున్న తప్పుడు ఆరోపణలు, ప్రచారాన్ని మైనారిటీలు నమ్మొద్దన్నారు. మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబుకు హిందువులు, ముస్లిం మైనారిటీలు రెండు కళ్లు వంటివారని అన్నారు. ముస్లింల పక్షాన చంద్రబాబు ఎల్లప్పుడూ ఉంటారన్నారు. టీడీపీ హయాంలో మైనారిటీలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని, రంజాన్ తోఫా, దుల్హన్, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రుణాలు తదితరవి అమలు అందజేశారన్నారు. జగన్‌రెడ్డి వచ్చాక అన్నింటినీ రద్దు చేసి ముస్లింలకు అన్యాయం చేశారన్నారు. మూడు రాజధానుల బిల్లుపై శాసన మండలిలో సంతకం చేయాలని తనను వైసీపీ అనేక రకాలుగా ప్రలోభ పెట్టినా అల్లాకు భయపడి, ముస్లిం మైనారిటీల గౌరవానికీ, విలువకు భంగం కలగకుండా తాను సంతకం చేయలేదని షరీఫ్ గుర్తు చేశారు. జగన్‌రెడ్డి మాయమాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. పర్చూరు నియోజకవర్గంలో, బాపట్ల పార్ల మెంట్‌లో టీడీపీ కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించడంలో ముస్లిం మైనారిటీలు ప్రముఖ పాత్ర పోషించాలని షరీఫ్ కోరారు. సమావేశంలో పఠాన్ ఖాదర్ వలి, షేక్ ఫరూక్, పసుమర్తి కరిముల్లా, గాలిబ్ బుడే, రహమాన్, కరిముల్లా, షాద్ భై, సుభాని, గన్నవరం బుడే తదితరులు పాల్గొనగా, పలువురు ముస్లిం మైనారిటీ యువకులు, మహిళలు, మత పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

నిరుద్యోగ యువతకు ఉపాధే లక్ష్యం


ఆ దిశగా ఎన్ఆర్ఐ టీడీపీ వింగ్ చర్యలు

మార్టూరు, మే 9 : వైసీపీ పాలనలో రాష్ట్రంలో నిరుద్యోగ యువత పెరిగిపోయారని వారికి ఉపాధి లక్ష్యంగా ఎన్ఆర్ఐ టీడీపీ వింగ్ పని చేస్తుందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం మండలంలోని ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ఎన్ఆర్ఐ టీడీపీ వింగ్ జిల్లా ప్రచార కార్యదర్శి దాసరి రమేష్‌బాబు టీడీపీ నాయకులతో కలిసి ఏలూరిని కలిశారు. ఈ సందర్భంగా వారితో ఏలూరి మాట్లాడుతూ యువతకు అంతర్జాతీయ ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఎన్ఆర్ఐ వింగ్ పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఎన్ఆర్ఐ టీడీపీ వింగ్ భరోసాగా ఉంటుందన్నారు. నిరుద్యోగ యువత కోసం టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఎన్ఆర్ఐ టీడీపీ వింగ్ పని చేస్తుందన్నారు. ఈ వింగ్ ద్వారా రాబోయే రోజులలో చదువుకున్న నిరుద్యోగ యువతకు లక్ష ఉద్యోగాలు కల్పనే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. వారి కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అంతేగాకుండా హెల్ప్‌లైన్ నంబరు ఏర్పాటు చేశామన్నారు. పర్చూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ అ వకాశాన్ని వినియోగించు కోవాలన్నారు.

ఓటింగ్‌పై టీడీపీ నేతల అవగాహన

అద్దంకి, మే 9 : ఓటింగ్ విధానంపై ప్రజలకు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహిస్తున్నారు. అద్దంకి పట్టణంలోని 11వ వార్డులో కౌన్సిలర్‌లు రంగిశెట్టి సుభాషిణి ఆధ్వర్యంలో గురువారం టీడీపీ నేతలు ఇంటింటికీ తిరిగి ఎన్నికల గుర్తు, బ్యాలెట్ నమూనాలపై అవగాహన కల్పించారు. టీడీపీ నేతలు లహరి తదితరులు పాల్గొన్నారు. 13వ వార్డులో కౌన్సిలర్ గుంటూరు విజయలక్ష్మి, టీడీపీ ఆర్యవైశ్య నేతలు భోజనపల్లి సత్యనారాయణ, పొట్టి వెంకట శివ, మామిడి రాంబాబు తదితరుల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి బ్యాలెట్ నమూనా చూపిస్తూ సైకిల్ గుర్తు కు ఓటు వేయాలని కోరారు.

ఎస్ఐగా రవిశంకర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



బల్లికురవ. మే 9 : బల్లికురవ ఎస్ఐగా రవిశంకర్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. పలు ఫిర్యాదుల నేపథ్యంలో ఎస్ఐ నాగశివారెడ్డిని సస్పెండ్ చేశారు. బాపట్ల రూరల్ ఎస్ఐగా పనిచేస్తున్న రవిశంకర్‌రెడ్డిని బల్లికురవకు నియమించారు. ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఎన్నికలకు ప్రజలందరూ సహకరించాలని ఎస్ఐ కోరారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అద్దంకిటౌన్, మే 9 : అద్దంకిలోని ఎస్‌బీఐ కాలనీ రోడ్డులో ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తం గురువారం ప్రకటన ద్వారా తెలిపారు. మూడవ తరగతిలో 40 సీట్లకు గాను 32 ఎస్టీ, 5ఎస్సీ, బీసీ 2, ఓసీ 1 చొప్పున కేటాయించడం జరిగిందన్నారు. అలాగే 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ ఖాళీలను ఎస్టీ విద్యార్థులతో భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9440883284, 8106567470 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా .. నిలిచిన ట్రాఫిక్

ఇంకొల్లు, మే 9 : ఇంకొల్లు నుంచి పర్చూరు వెళ్లే పాతమద్రాసు రోడ్డులో పూసపాడు అడ్డరోడ్డు వంకాయలపాడు మధ్య ఉన్న డైవర్షన్ రోడ్డులో గురువారం గడ్డి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. నాలుగు సంవత్సరాలుగా ఇక్కడ వంతెన శిథిలావస్థకు చేరడంతో దానిపై రాకపోకలు నిలిపివేశారు. పక్కన డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేసారు. కానీ దీనిపై కూడా పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గురువారం గడ్డి ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో ఇంకొల్లు పర్చూరు మధ్య రాకపోకలకు అంతరాయం జరిగింది.

కూలిన భవనం.. తప్పిన పెను ప్రమాదం

పర్చూరు లక్ష్మీపురంలో ఘటన



భవన శిథిలాలు

పర్చూరు, మే 9 : భవనం కూలిపోయిన ఘటన పర్చూరులోని లక్ష్మీపురంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పర్చూరుకు చెందిన సారగం అభిలాష్ ఇంటి స్లాబ్‌తో సహా కూలిపోయింది. ఆసమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. భవనం ఒక్కసారిగా కూలి పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల నివాసాల వారు ఆందోళనకు గురయ్యారు. ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.